ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5

అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 30 జనవరి 2024



వైసీపీకి ఓటేస్తే ఆత్మద్రోహమే

- పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన గౌడ్



మాట్లాడుతున్న పెద్దన గౌడ్

అనంతపురం టౌన్, జనవరి 29: వైసీపీకి మళ్లీ ఓటు వేస్తే ఆత్మద్రోహం అవుతుందని పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన గౌడ్ అన్నారు. నాలుగున్నరేళ్లుగా వైసీపీ ప్రభుత్వం పెన్షనర్లకు తీరని అన్యాయం చేస్తోందని, ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న ఆర్థిక ప్రయోజనాలను ఒక్కొక్కటిగా రద్దు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్రంలో సైకో సీఎం పాలన సాగిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఈ దుర్మార్గపు సీఎం అనాలోచిత నిర్ణయాలతో పెన్షనర్లు రోడ్డున పడుతున్నారని అన్నారు. కనీసం ఒకటో తేదీన పెన్షన్ రావడంలేదని, ఎపుడొస్తుందో తెలియక ఎదురుచూడాల్సి వస్తోందని అన్నారు. పీఆర్సీలో తీరని అన్యాయం జరిగిందని, పెన్షనర్ల స్లాబ్ శాతాలను పునరుద్ధరించాలని, డీఆర్ బకాయిలు, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని, వైద్య ఖర్చుల చెల్లింపులు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని, లేకపోతే ఈ ప్రభుత్వానికి, సీఎం జగన్‌కు సత్తా చూపిస్తామని హెచ్చరించారు. చిన్నచిన్న సమస్యలను కూడా ఈ ప్రభుత్వం పరిష్కరించకపోవడం దారుణమని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ అన్నారు. ఉద్యమాలను నీరుగార్చడం ప్రభుత్వ నియంత పాలనకు అద్దం పడుతోందని విమర్శించారు. న్యాయమైన ఉద్యమాలకు సమాజం అండగా నిలబడుతుందని అన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జయరామప్ప, ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర రెడ్డి, చంద్రమోహన్, ఏపీటీఎఫ్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

- సెర్ప్ ఉద్యోగుల డిమాండ్



అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టిన ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29: ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సెర్ప్ ఉద్యోగులు ఆందోళనబాట పట్టారు. డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అక్కడి నుంచి అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం సప్తగిరి సర్కిల్, సంగమేష్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని కోరుతూ స్పందనలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఎన్నికలకు ముందు సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సీనియార్టీ ప్రకారం అర్హులకు ఉద్యోగోన్నతి, జీతాల పెంపు అమలు చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సెర్ప్ ఉద్యోగుల జేఏసీ కన్వీనర్లు మల్లికార్జున, శ్రీరాములు, నారాయణస్వామి, సుభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు బీఎల్వోలపై వేటు

- మిగిలినవారిలో గుబులు
- ఓటరు జాబితా తప్పుల పర్యవసానం

అనంతపురం టౌన్/యాడికి, జనవరి 29: ఓటర్ల తుది జాబితా రూపకల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు బీఎల్వోలను కలెక్టర్ గౌతమి సస్పెండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లావ్యాప్తంగా ఓటర్ల తుది జాబితాలో మృతుల పేర్లు, డబుల్, ట్రిపుల్ ఎంట్రీలపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలను ప్రచురిస్తోంది. ముసాయిదా జాబితాలో వచ్చిన తప్పులే తుది జాబితాలోనూ ఉన్నాయి. దీంతో కలెక్టర్ సీరియస్‌గా స్పందించారు. తాడిపత్రి నియోజకవర్గంలోని యాడికి 83వ పోలింగ్ కేంద్రం బీఎల్వో ఆదిలక్ష్మి(వీఆర్‌ఏ), 84వ పోలింగ్ కేంద్రం బీఎల్వో క్రిష్ణాంజలి (సచివాలయ మహిళా పోలీస్), యాడికి మండలం ఓబుళాపురం 91వ పోలింగ్ కేంద్రం, కోన ఉప్పలపాడు 92వ పోలింగ్ కేంద్రం బీఎల్వో గౌతమ బుద్ధుడు (వీఆర్‌ఓ)ను కలెక్టర్ సస్పెండ్ చేశారు. అనంతపురం అర్బన్, రాప్తాడు నియోజకవర్గాలలో అక్రమాలపైనా కలెక్టర్ స్పందించారు. పత్రికలలో వచ్చిన కథనాలపై పూర్తిస్థాయి విచారించి నివేదికలు పంపాలని ఆయా నియోజకవర్గాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. నివేదిక ఆధారంగా మరికొందరు బీఎల్వోలపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారవర్గాలు అంటున్నాయి. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో ఓటర్ల తుదిజాబితా తప్పుల తడకగానే ఉంది. కలెక్టర్ చర్యలతో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అధికారులు, సిబ్బందిలో గుబులు మొదలైంది.

అక్రమించి.. అమ్మేస్తున్నారు..!



అడవిలో కబ్జాదారులు నరికేసిన చెట్లు

- ఎకరానికి రూ.60 వేల వసూలు
- అటవీ భూములతో వైసీపీ నేతల దందా
- చెట్లను నరికేసి.. వందల ఎకరాల చదును
- ఫిర్యాదులపై స్పందించని జిల్లా అధికారులు



విడపనకల్లు(వజ్రకరూరు), జనవరి 29

ట్రైబల్ చట్టంలోని లొసుగులను అనుకూలంగా మార్చుకుని, అటవీ భూములను కాజేయాలని కుట్ర పన్నారు అధికార పార్టీకి చెందిన కొందరు. వజ్రకరూరు మండలం భద్రంపల్లి ప్రాజెక్ట్ పరిధిలో అటవీ ప్రాంతాన్ని పథకం ప్రకారం ఆక్రమించుకుంటూ పోతున్నారు. 2006 ట్రైబల్ చట్టం ప్రకారం, 2006 కంటే ముందు నుంచి అటవీ ప్రాంతంలో భూములను సాగుచేసుకుంటున్న రైతులు సాగు దారులుగా గుర్తించబడుతారు. ఈ చట్టాన్ని ఆసరగా చేసుకుని, పెద్ద ఎత్తున భూములను కాజేయాలని చూస్తున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల నుంచి భూముల ఆక్రమణ మొదలైంది. దాదాపు 500 ఎకరాల్లో పెద్ద పెద్ద వృక్షాలను నరికేసి, సాగు భూములుగా మార్చుకుంటున్నారు. భూముల చదును, వృక్షాల తొలగింపు కోసం ఏకంగా ఎక్స్‌కవేటర్లను వినియోగిస్తున్నారు. వారికి అధికారులు సహకరిస్తున్నారు.

అనర్హుల పేరిట జాబితా..?

- వజ్రకరూరు మండల పరిధిలోని ఎస్ఎస్‌వీ తండా, పందికుంట, వెంకటాంపల్లి తండా, జరుట్లరాంపురం ప్రాంతాలలో అటవీ భూములను అధికార పార్టీ నాయకులు, వారి అనుచరులు ఆక్రమించుకుంటున్నారు. పామిడి మండలంలోని రామగిరి, పాళ్యం, కత్రిమల గ్రామాల్లోని అటవీ ప్రాంతాలను కూడా ఆక్రమిస్తున్నారు. ఈ అటవీ ప్రాంతాలలో అధికారికంగా 45 మంది రైతులకు ఒక్కొక్కరికి 5 ఎకరాల ప్రకారం సాగు పట్టాలు ఇచ్చేందుకు జాబితాను తయారు చేసినట్లు తెలిసింది. జాబితాలో ఉన్నవారందరూ అధికార పార్టీవారే అని సమాచారం. అధికార పార్టీవారు కావడంతో అనర్హులైనా, భూపంపిణీకి సిద్ధమయ్యారని ఆరోపిస్తూ.. స్థానికులు జిల్లా అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. కానీ స్పందన లేదని అంటున్నారు.

అనర్హులతో జాబితా..



అటవీ భూమిని సాగు చేసుకుంటున్న రైతులకు కాదని అనర్హులకు భూ పంపిణీకి సిద్ధమయ్యారు. మొత్తం 45 మందితో జాబితా తయారు చేశారు. ఈ విషయమై జిల్లా అధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేశాము. అధికారులు పట్టించుకోవటంలేదు. అడవి మొత్తాన్ని ఆక్రమిచుకుంటున్నా పట్టించుకునేవారు లేరు.

- పి.వాలేనాయక్, వెంకటాంపల్లి పెద్ద తండా

- ఇప్పటికే సుమారు 225 ఎకరాల పంపిణీకి సిద్ధమయ్యారని, ఇది చాలదన్నట్లు నియోజకవర్గంలోని కొంతమంది నాయకులు ఒక్కొక్కరు 50 నుంచి 60 ఎకరాల వరకూ ఆక్రమించారని అంటున్నారు. ఇలా నాలుగు వందల ఎకరాలకు పైగా ఆక్రమించి.. ఒక్కొక్కరికి ఐదెకరాలకు పట్టాలు ఇప్పిస్తామని బేరం పెట్టినట్లు సమాచారం. ఎకరానికి రూ.60 వేలకు పైగా వసూలు చేశారని ప్రచారం జరుగుతోంది. సర్వే నంబర్ 334-బిలో ఉన్న 2,082.32 ఎకరాల అటవీ భూముల్లో దాదాపుగా 25 శాతం ఆక్రమణకు గురయ్యాయి. అధికార పార్టీ నాయకుల బెదిరింపుల కారణంగా అటవీశాఖ అధికారులు కన్నెత్తి చూడటం లేదని అంటున్నారు.

చర్యలు తీసుకోవాలి..



వజ్రకరూరు మండలంలోని అటవీ భూమిని కొంతమంది నాయకులు ఆక్రమించుకుంటున్నారు. మహా వృక్షాలను నరికి భూమిని చదును చేశారు. దాన్ని అమ్మేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ పెద్దలు భూ అక్రమణను అడ్డుకుని, నిజమైన పేదలకు భూ పంపిణీ చేయాలి.

- సుబ్రహ్మణ్యం నాయక్, వెంకటాంపల్లి పెద్ద తండా

అడవులను కాపాడండి...

భద్రంపల్లి ప్రాజెక్టు పరిధిలోని అటవీ భూమిని కాపాడాలి. వజ్రకరూరు మండలంలో భూ ఆక్రమణలు నానాటికీ పెరిగిపోతున్నా పట్టించుకునేవారు లేరు. అధికార పార్టీ నాయకులదే రాజ్యం. ఇప్పటికే ఐదొందల ఎకరాలకుపైగా ఆక్రమించారు. అడవులు నరికే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.




- తులసీనాయక్, వెంకటాంపల్లి పెద్ద తండా

ప్రచారం నిజమే..

మేమెవ్వరికీ భూ పంపిణీ చేయటంలేదు. ఎవరు సాగులోకి వచ్చినా బయటకు పంపుతున్నాము. అటవీ ప్రాంతాన్ని కాపాడుతాము. అడవిలో గస్తీ నిర్వహించి, చెట్లను కాపాడుతాము.

- సతీష్, బీట్ ఆఫీసర్, వజ్రకరూరు మండలం



వైసీపీ దౌర్జన్యాలను అడ్డుకుందాం

- మాజీ మంత్రి పరిటాల సునీత



ఏడు గుర్రాలపల్లి వాసులతో పరిటాల సునీత

రామగిరి, జనవరి 29: నియోజకవర్గంలో వైసీపీని ఓడించి.. ఎమ్మెల్యే, ఆ పార్టీ నాయకుల దౌర్జన్యాలను అడ్డుకుందామని మాజీ మంత్రి పరిటాల సునీత పిలుపునిచ్చారు. వెంకటాపురం గ్రామంలో ఏడు గుర్రాలపల్లి గ్రామస్థులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సోమవారం సాయంత్రం ఆమె సమావేశం నిర్వహించారు. గ్రామంలో ఏ సమస్య వచ్చినా నేరుగా వచ్చి తనను కలవాలని, అందరికీ అందుబాటులో ఉంటానని అన్నారు. విభేదాలు వీడి, ఐకమత్యంగా ఉండాలన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని, వైసీపీ పాలనలో జరుగుతున్న అరాచకాలు, దౌర్జన్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్, తెలుగు యువత అధ్యక్షుడు లింగా శ్రీధర్‌నాయుడు, ఎస్సీసెల్ నాయకుడు పోతన్న, ఏడుగుర్రాలపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లు ఇవ్వండి..!

- ఎల్ఐసీకి వినియోగదారుల కమిషన్ ఆదేశం
- సేవా లోపానికి రూ.50 వేల పరిహారం కూడా..
- ప్రమాద మృతుడి కుటుంబానికి అనుకూలంగా తీర్పు

అనంతపురం క్రైం, జనవరి 29: ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి రూ.2 కోట్ల బీమా ప్రీమియంతోపాటు నష్ట పరిహారాన్ని, ఖర్చులను చెల్లించాలని ఎల్ఐసీని జిల్లా వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. ఇరుపక్షాల వాదన విన్న అనంతరం కమిషన్ అధ్యక్షురాలు ఎం.శ్రీలత సోమవారం తీర్పును వెలువరించారు. అనంతపురం నగరానికి చెందిన ఎస్.లక్ష్మీదేవి భర్త శ్రీనివాసులు ప్రమాదవశాత్తూ రైలు కింద పడి మృతిచెందారు. ఆయన 2018 జూలై 17న పీలేరు బ్రాంచ్ నుంచి జీవన్ లాభ్ బీమా పాలసీ తీసుకున్నారు. రూ.5 లక్షలకు పైగా ప్రీమియం చెల్లించారు. తన, తన భార్య ఆర్థిక స్థితిని ఆయన ఎల్ఐసీవారికి కనపరిచారు. ఏజెంట్ సూచన మేరకు మెడికల్ సర్టిఫికెట్ కూడా పొందుపరిచాడు. ఈ పాలసీ కింద సాధారణ మరణానికి రూ.కోటి, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 కోట్లు బీమా వర్తిస్తుంది. ఈ పాలసీతో పాటు మరికొన్ని పాలసీలను కూడా శ్రీనివాసులు తీసుకున్నారు. 2020 ఫిబ్రవరి 16న ఆయన ప్రమాదవశాత్తూ మరణించినట్లు రైల్వే పోలీసులు నిర్ధారించారు. బీమా పరిహారం కోసం శ్రీనివాసులు భార్య ఎల్ఐసీ వారిని సంప్రదించారు. రూ.10 లక్షల లోపు ఉన్న పాలసీలకు సొమ్ము చెల్లించిన ఆ సంస్థ.. రూ.2 కోట్ల పాలసీని మాత్రం తిరస్కరించింది. దీంతో బాధితురాలు జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. పాలసీదారుకి ప్రీమియం చెల్లించే స్తోమత లేదని, ఏజెంటుతో కుమ్మక్కై దురుద్దేశపూర్వకంగా పాలసీని పొందారని ఎల్ఐసీ వాదించింది. మరొక భారీ రుణం ఉన్నట్లు పాలసీదారు తెలియపరచలేదని, రైలు కింద పడి మరణించడం అనుమానాస్పదంగా ఉందని కూడా వాదించింది. ఈ వాదనలతో కమిషన్ ఏకీభవించలేదు. బీమా పరిహారాన్ని తిరస్కరించడానికి తగిన ఆధారాలను ఎల్ఐసీ చూపలేకపోయిందని స్పష్టం చేసింది. పాలసీదారు ప్రమాదవశాత్తు మరణించినట్లు అన్ని ఆధారాలను చూపించారని, ఫిర్యాదుదారుకు 60 రోజులలోగా పరిహారం మొత్తం రూ.2 కోట్లు చెల్లించాలని ఆదేశించింది. సేవాలోపానికి, మనోవేదనకు అదనంగా రూ.50 వేలు, ఖర్చుల కింద మరో రూ.5 వేలు చెల్లించాలని కమిషన్ అధ్యక్షురాలు ఎం.శ్రీలత, సభ్యులు డి.గ్రేస్ మేరీ, బి.గోపీనాథ్‌తో కూడిన కమిషన్ తీర్పు చెప్పింది.

అటా..? ఇటా..?

- వైసీపీలో మెట్టు.. కాపు వర్గీయుల ఆట
- ఎవరు ఎటువైపో తెలియక అయోమయం



మెట్టు గోవిందరెడ్డి



కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం, జనవరి 29: టిక్కెట్ల కేటాయింపుల నేపథ్యంలో తలెత్తిన పరిణామాలు వైసీపీ శ్రేణుల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. మిత్రులెవరో.. శత్రువులెవరో తెలియని అయోమయంలో.. అందరినీ అనుమానించే పరిస్థితి ఏర్పడింది. మొన్నటి వరకు ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి కనుసన్నల్లో మెలిగిన నాయకులు నెమ్మదిగా దూరమౌతున్నారు. ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డిని రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించడంతో ఒక్కొక్కరుగా ఆయన శిబిరంలో చేరుతున్నారు. కాపును వదిలి.. మెట్టు వెంట నడుస్తున్నారు. 'అయితే ఇంకేం..? అధికార పార్టీ అభ్యర్థికి మంచిదే కదా..?' అనుకోవచ్చు. అలా మెట్టు వెంట నడుస్తున్నవారు.. కాపు రామచంద్రారెడ్డి నియోజకవర్గ పర్యటనకు వస్తే.. అక్కడా కనిపిస్తున్నారు. ఆయన చేపట్టే కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. దీంతో వారు అధికార పార్టీలో ఉన్నారా..? అధికార పార్టీని వ్యతిరేకిస్తున్న కాపు చెంత ఉన్నారా తెలియని పరిస్థితి.

కాపు వ్యూహమేమిటి..?

జగన్ తన గొంతు కోశాడని ఆవేదన వ్యక్తం చేస్తూ, తాడేపల్లి ప్యాలెస్‌కు సెల్యూట్ కొట్టి వచ్చారు రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి. అలాంటి ఆయన వెంట ఎలా తిరుగుతారని మెట్టు వర్గీయులు ప్రశ్నిస్తున్నారు. అటో ఇటో తేల్చుకోవాలని సూచిస్తున్నారు. వైసీపీ అభ్యర్థిగా మెట్టు గోవిందరెడ్డి పేరు ఖరారు కావడంతో.. ఇప్పటికే వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన వద్దకు చేరుకున్నారు. ఈ పరిణామాలను గమనిస్తున్న కాపు రామచంద్రారెడ్డి, గణతంత్ర దినోత్సవాలకు హాజరయ్యారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. దీంతో కాపు వ్యూహం ఏమిటోనని మెట్టు వర్గీయులు ఆలోచనలో పడ్డారు. మెట్టును ఓడించడమే తన ఏకైక లక్ష్యం అన్నట్లు కాపు రామచంద్రారెడ్డి పావులు కదుపుతున్నారని ప్రచారం జరుగుతోంది.

ఏం జరుగుతోంది..?

మెట్టు గోవిందరెడ్డికి టిక్కెట్ ఖరారు చేసిన కొద్దిరోజుల వరకు స్తబ్దుగా ఉన్న వైసీపీ నాయకులు.. క్రమేపీ మెట్టు వెనుక నడవడానికి సిద్ధమవుతున్నారు. కాపు రామచంద్రారెడ్డికి టిక్కెట్ ఇవ్వకపోతే రాజీనామా చేస్తామని ప్రకటించిన కొందరు, సర్దుకుని మెట్టు వద్దకు చేరిపోయారు. దీని వెనుక కాపు ఎత్తుగడ ఉందని ప్రచారం జరుగుతోంది. మెట్టు వద్దకు చేరుకోవాలని కాపు రామచంద్రారెడ్డి తన వర్గీయులను సాగనంపినట్లు విశ్వసనీయ సమాచారం. ఎన్నికల్లో మెట్టును దగ్గరుండి దెబ్బతీసేందుకు కాపు వర్గీయులు వ్యూహాత్మకంగా అక్కడికి వెళ్లారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

తప్పెవరిది..?

- కొనసాగుతున్న ఆకులేడు భూ వివాదం
- కలెక్టరేట్ వద్ద తల్లీకొడుకుల నిరసన
- 1969లో ఖాసీం కుటుంబానికి పట్టాలు
- 2004లో రద్దు చేసి.. అధికార పార్టీవారికి..

బతుకుదెరువు కోసం ముగ్గురు అన్నదమ్ములకు 55 ఏళ్ల క్రితం ప్రభుత్వం డి-పట్టాలు మంజూరు చేసింది. వారు ఊళ్లో లేరన్న కారణంగా 20 ఏళ్ల క్రితం పట్టాలను రద్దు చేసి, అధికార పార్టీవారికి కేటాయించింది. ఇది అన్యాయమని తొలుత పట్టాలు పొందిన కుటుంబం అంటోంది. కొత్తగా పట్టాలు తీసుకున్నవారు కూడా ఊళ్లో లేరు కదా..? అని ప్రశ్నిస్తోంది. పట్టాల రద్దు సమయంలో నిబంధనలు పాటించారా..? వారు సాగులో లేనందుకే పట్టాలను రద్దు చేశారా..? ఆ భూములకు మారు పట్టాలు పొందినవారు నిజంగానే సాగులో ఉండేవారా..? అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఆశ్రిత పక్షపాతం చూపించారా..? ఇన్ని సందేహాలను అధికారులు నివృత్తి చేయాల్సి ఉంది. తమకు న్యాయం కావాలని ఓ వృద్ధురాలు.. ఆమె కుమారుడు కొన్నాళ్లుగా కలెక్టరేట్ వద్ద ఆందోళన కొనసాగిస్తున్నారు.

- శింగనమల



శింగనమల మండలం ఆకులేడు సర్వే నంబర్ 173 భూమి ఇదే

ఇదే ఆ భూమి..

ఆకులేడు రెవెన్యూ పొలంలోని సర్వే నంబర్ 173లో అదే గ్రామానికి చెందిన ఖాసీంసాబ్ సోదరులకు ప్రభుత్వం 1969లో డి-పట్టాలు ఇచ్చింది. డీఏఆర్‌డీఐఎస్ నంబరు 287-69 కింద ఖాసీం పేరిట 5 ఎకరాలు, అతని సోదరులు చిన్నబాబా సాబ్‌కు 3.75 ఎకరాలు, ఇమాంసాబ్‌కు 3.72 ఎకరాలను కేటాయించింది. మొత్తం 12.47 ఎకరాలను వారు సాగు చేసుకునేవారు. ఖాసీం సాబ్ మరణానంతరం ఆయన కుమారులు బతుకు తెరువు నిమిత్తం అనంతపురం నగరానికి చేరుకున్నారు. ఈ క్రమంలో పొలాన్ని అధికార పార్టీ నాయకుడు వేణుకు గుత్తకు ఇచ్చామని ఖాసీం సాబ్ భార్య భానూబీ అంటున్నారు. కానీ, పట్టాదారులు సాగులో లేరన్న కారణం చూపించి.. 2004లో డి-పట్టాలను ప్రభుత్వం రద్దు చేసింది. అప్పటి కాంగ్రెస్ నాయకుడు, ప్రస్తుతం అధికార పార్టీలో ఉన్న వేణు కుట్రపన్ని తమ పట్టాలను రద్దు చేయించారని భానూబీ ఆరోపిస్తున్నారు. అదే ఏడాది అసైన్‌మెంట్ కమిటీలో వేణు సమీప బంధువుల పేరిట ఆ భూములకు పట్టాలను ఇచ్చారు.

వారూ ఊరిలో లేరు కదా..?

తమ కుటుంబాలు జీవనోపాధి కోసం అనంతపురం చేరడాన్ని సాకుగా చూపించి తమ పట్టాలను రద్దు చేశారని, పట్టాలు అందుకున్న వేణు బంధువులు కూడా ఊళ్లో లేరు కదా అని భానూబీ ప్రశ్నిస్తున్నారు. పట్టాలు పొందినవారిలో వనజాక్షి (3.75 ఎకరాలు), లక్ష్మీదేవి (2.75) అనంతపురంలోనే ఉన్నారని ఆమె అన్నారు. రెవెన్యూ అధికారులకు ఈ విషయం తెలియదా అని నిలదీశారు. గతంలో తాము ఫిర్యాదు చేశామని, విచారించిన అధికారులు ఆ భూములు తమకే చెందుతాయని అన్నారని గుర్తు చేశారు. అప్పటి అనంతపురం ఎంపీ అనంత వెంకటరామిరెడ్డి, అప్పటి ఎమ్మెల్యే శైలజానాథ్‌పై వేణు ఒత్తిడి తెచ్చి తమ భూముల పట్టాలను రద్దు చేయించారని, తన బంధువులకు ఇప్పించుకున్నారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.

నాలుగేళ్లుగా తిరుగుతున్నాం..

తమ భూమిని తిరిగి ఇప్పించాలని కోరుతూ నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నామని భానూబీ, ఆమె కుమారుడు దస్తగిరి ఆవేదన వ్యక్తం చేశారు. శింగనమల ఎమ్మెల్యే పద్మావతి భర్త సాంబశివారెడ్డిని కలిసి న్యాయం చేయాలని కోరామని, ఆక్రమించినవారు అనంతపురం ఎమ్మెల్యే మనుషులు కావడంతో పట్టించుకోవడం లేదని అన్నారు. శింగనమల తహసీల్దార్ కార్యాలయం, కలెక్టరేట్ వద్దకు పలుమార్లు తిరిగి అర్జీలు ఇచ్చినా పట్టించుకోలేదని అన్నారు. రెండు నెలల క్రితం శింగనమల తహసీల్దార్ కార్యాలయం వద్ద పది రోజులపాటు బాధితులు నిరసన దీక్ష చేపట్టారు. అక్కడ న్యాయం జరగలేదని ప్రస్తుతం కలెక్టరేట్ వద్ద ఆందోళనకు దిగారు.



కలెక్టరేట్ గేట్ ముందు మండుటెండలో నిరసన సాగిస్తున్న వృద్ధురాలు భానూబీ

ఐదుగురికి డి-పట్టాలు ఇచ్చారు..

ఆకులేడు సర్వే నంబరు 173లో ఐదుగురికి 2004 అసైన్‌మెంట్ కమిటీలో డి-పట్టాలు ఇచ్చారు. వారు ఆ భూములలో సాగులో ఉన్నారని చూపించారు. దీనిపై భానూబీ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఆ భూమి తమకు దక్కుతుందని వారు అంటున్నారు. దీనిపై విచారించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- ఈశ్వరమ్మ, శింగనమల తహసీల్దారు

న్యాయం చేస్తాం: కలెక్టర్

అనంతపురం టౌన్: పెద్దల నుంచి తమకు సంక్రమించిన పట్టా భూమిని అన్యాయంగా లాగేసుకున్నారని భానూబీ కుమారుడు దస్తగిరి కలెక్టర్ గౌతమికి స్పందనలో సోమవారం ఫిర్యాదు చేశారు. రికార్డులను స్వయంగా పరిశీలించి, న్యాయం చేస్తామని వారికి కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టరేట్ వద్ద మండుటెండలో తల్లీకొడుకులు నిరసన కొనసాగించారు. ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తామని దస్తగిరి తెలిపారు.

ఒక్కొక్కరికి రెండు, మూడు ఓట్లు






గిరక నాగజ్యోతి పేరు మీద మూడు ఓట్లు

ధర్మవరం రూరల్, జనవరి 29: మండలంలోని గొట్లూరు గ్రామంలో ఓటర్ల జాబితాలో మళ్లీ అవే తప్పులు వచ్చాయి. డబుల్ ఓట్లు తొలగించాలని బీఎల్ఓలతో కలిసి పార్టీల ప్రతినిధులు ఇళ్ల వద్దకు వెళ్లి సర్వేచేసి గుర్తించారు. వీటిని తొలగించాలనీ, తప్పులు లేని తుది ఓటరు జాబితా విడుదల చేయాలన్న ఎన్నికల సంఘం ఆదేశాలను సైతం తొంగలో తొక్కిన బీఎల్ఓలు మళ్లీ అవే తప్పులు చేశారు. వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే ధర్మవరం మండలంలోని గొట్లూరు గ్రామంలో 145వ పోలింగ్‌బూత్‌లో సీరియల్ నంబర్లు 116, 117, 1200లో గిరక నాగజ్యోతి పేరు మీద మూడు ఓట్లు వచ్చాయి. అదే బూత్ పరిధిలో 904, 905 సీరియల్ నంబర్లలో సతీష్‌కుమార్ మందల పేరుమీద డబుల్ ఓట్లు వచ్చాయి. సీరియల్ నంబర్ 9లో హసీనా షేక్ మహిళ ఓటరు గ్రామంలో ఉన్నప్పటికీ తొలగింపు జాబితాలో చేర్చారు. అధికారుల నిర్లక్ష్యంపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.


చనిపోయినా.. ఓటు యథాతథం..



ఓటరు జాబితాలో మృతులు హుస్సేన్‌పీరా, ముష్టూరు బాబు పేర్లు

ముదిగుబ్బ: ఓటర్ల తుది జాబితాలోనూ మృతుల ఓట్ల ను తొలగించలేదు. మండల వ్యాప్తంగా అవే తప్పులు పునరావృతమయ్యాయి. ముదిగుబ్బలోని 67వ పోలింగ్‌బూత్‌పరిధిలో రాళ్లపల్లి హుస్సేన్‌పీరా, ముష్టూర్ బాబు రెండేళ్ల క్రితం చనిపోయారు. బీఎల్ఓలకు రాజకీయ పార్టీ నాయకులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఓటరు జాబితాలో వారి ఓట్లను తొలగించలేదు. కుటుంబ సభ్యుల నుంచి మృతిచెందిన ఓటర్ల మరణ ధృవీకరణపత్రాలు కూడా తీసుకున్నట్లు సమాచారం. 67వ పోలింగ్‌బూత్‌లో దాదాపు 15 ఓట్లు వరకు మరణించిన వారివి తొలగించలేదని రాజకీయ పార్టీ నాయకులు వాపోతున్నారు.

తప్పులతడకగా జక్కేపల్లి ఓటరు జాబితా



మృతిచెందిన వారి ఓట్లను అలాగే ఉంచిన దృశ్యం

మడకశిర రూరల్, జనవరి 29: మండలంలోని జక్కేపల్లిలో 206 పోలింగ్ కేంద్రం పరిధిలో 13, 160, 204, 34, 134, 276, 70, 87, 198, 141, 109, 224 సీరియల్ నంబర్లలోని ఓటర్లు మొత్తం 12 మంది మృతిచెందారు. ఓటర్లు జాబితాలో మాత్రం వారు బతికే ఉన్నారు. 207వ పోలింగ్ కేంద్రం పరిధిలో సీరియల్ నంబర్లు 375, 250, 236, 215, 134, 67, 252, 238, 236, 104, 93, 30లో మొత్తం 12 మంది మృతి చెందారు. రెండు పోలింగ్ కేంద్రాల్లో 24 మంది మృతి చెందిన వారి ఓట్లను జాబితాలో అలాగే ఉంచారు.

ఒకే కేంద్రం పరిధిలో 110 మంది..



మృతిచెందిన లక్ష్మీనారాయణ, పెద్ద ఓబిలేసు

శింగనమల: ఓటరు తుది జాబితాలో మృతుల పేర్లు కుప్పలు తెప్పలుగా బయటపడుతున్నాయి. శింగనమల మండలంలోని రాచేపల్లిలో.. ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఏకంగా 110 మంది మృతుల పేర్లు ఉన్నాయి. రాచేపల్లి 60వ పోలింగ్ కేంద్రం పరిధిలో 900 మంది ఓటర్లు ఉన్నట్లు తుది జాబితాలో చూపించారు. ఇందులో 110 మంది కొన్నేళ్ల క్రితమే చనిపోయారు. సుబ్బన్నగారి రవీంద్ర (సీరియల్ నంబరు 31), నారప్ప (సీరియల్ నంబరు 36), ఎర్రమ్మ (సీరియల్ నంబరు 225), ఓబుళమ్మ(232), మేకల తిరుపతయ్య(335) ఎరికల నారాయణస్వామి (283) ఇలా చాలామంది చనిపోయారు. అయినా వారి పేర్లను జాబితా నుంచి తొలగించలేదు.

సీఐలు.. ఎస్ఐల బదిలీ

పుట్టపర్తి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు సీఐలు, ఎస్ఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి సోమవారం ఆదేశాలు జారీచేశారు. అనంతపురం వీఆర్‌లో ఉన్న కృష్ణమరాజు నాయక్‌ను ముదిగుబ్బ సర్కిల్‌కు, ముదిగుబ్బ సీఐ యతీంద్రను ముదిగుబ్బ అప్‌గ్రేడ్ పీఎస్‌కు బదిలీ చేశారు. అమరాపురం ఎస్ఐ బీటీ వెంకటేశ్వర్లును రామగిరి పోలీస్ స్టేషన్‌కు, పుట్టపర్తి అర్బన్ ఎస్ఐ వీరేష్‌ను అగళికి, పుట్టపర్తి డీసీటీలో పనిచేస్తున్న క్రిష్ణవేణిని గాండ్లపెంటకు, కొత్తచెరువు ఎస్ఐ సురేష్‌బాబును బుక్కపట్నం పోలీస్ స్టేషన్‌కు, ముదిగుబ్బ ఎస్ఐ వంశీకృష్ణను ఓడీచెరువుకు బదిలీ చేశారు. నల్లమాడ ఎస్ఐ వరలక్ష్మీదేవిని పుట్టపర్తిలోని దిశ మహిళ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

యువరైతు ఆత్మహత్య



మృతిచెందిన రైతు మురళీమోహన్

రామగిరి, జనవరి 29: మండలంలోని గంగంపల్లి గ్రామంలో మురళీమోహన్(34) అనే యువ రైతు ఆత్మహత్య చేసుకున్న ట్లు గ్రామస్థులు తె లిపారు. యువరై తు మురళీమోహన్‌కు 10 ఎకరాల భూమి ఉంది. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. సోమవారం 3గంటల సమయంలో తోట వద్దనున్న పశువుల పాకలో ఉరివేసుకుని మృతిచెందాడు. తోటలోకి వెళ్లి చూసిన కుటుంబసభ్యులు వెంటనే గ్రామస్థులకు తెలియజేశారు. సంఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేపట్టారు. మృతుడికి భార్య బార్గవి ఉంది. రైతు ఆత్మహత్యకుగల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

వారసత్వం వైపు...

టీడీపీ చూపు!

- అధినేత, యువనేత మదిలో అదే యోచన
- రేసులో పరిటాల శ్రీరామ్, పల్లె సింధూర, జేసీ అశ్మిత్‌రెడ్డి, సవితమ్మ



పరిటాల శ్రీరామ్



సవితమ్మ



జేసీ అశ్మిత్ రెడ్డి



పల్లె సింధూర

అనంతపురం, జనవరి 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గెలుపుగుర్రాలకే టిక్కెట్లు ఇవ్వాలన్న యోచనలో ఆ పార్టీ అధిష్టానం ఉన్నట్లు సమాచారం. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికపై టీడీపీ అధిష్టానం తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తోంది. యువత, బీసీ వర్గాలు, మహిళలకు టిక్కెట్ల కేటాయింపులో పెద్దపీట వేయాలని ఆ పార్టీ అధిష్టానం నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. తాజా గా ఉరవకొండలో రా.. కదలిరా బహిరంగ సభ అనంతరం ఉమ్మడి జిల్లా ముఖ్య నేతలతో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు అంతర్గత సమావేశం నిర్వహించిన సందర్భంలోనూ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. యువతకు 40 శాతం టిక్కెట్లు ఇవ్వాలని ఆ పార్టీ నిర్ణయం తీసుకుంది. బీసీ నాయకులు, మహిళలకు ఈ ఎన్నికల్లో ప్రాధాన్యం ఇవ్వాలనే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. అందులో భాగంగానే... ఉమ్మడి జిల్లాలో మరీ ముఖ్యంగా వారసత్వం వైపు ఆ పార్టీ అధిష్టానం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మదిలోనూ అదే యోచన ఉన్నట్లు సమాచారం. పరిటాల కుటుంబం నుంచి పరిటాల శ్రీరామ్, జేసీ కుటుంబం నుంచి జేసీ అశ్మిత్‌రెడ్డి, పల్లె కుటుంబం నుంచి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కోడలు పల్లె సింధూర, మాజీ మంత్రి రామచంద్రారెడ్డి కుటుంబం నుంచి సవితమ్మకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రాధాన్యం ఇవ్వాలనే నిర్ణయానికి అధిష్టానం వచ్చినట్లు సమాచారం. ఇప్పటికే ఆ మేరకు ఆ పార్టీ నియమించిన బృందాలు సర్వేలో నిమగ్నమయ్యాయి. తొలి నుంచి ఆ కుటుంబాలు తెలుగుదేశం పార్టీకి విధేయులుగా కొనసాగుతున్న నేపథ్యంలోనే వారసత్వానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వడానికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీలో యువతకు పెద్దపీట వేయాలని పార్టీ అధినాయకత్వం భావిస్తున్న తరుణంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సామాజిక కోణాన్ని పరిగణలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. కాగా... వారసత్వ రాజకీయాల్లో భాగంగా... ఇప్పటికే పరిటాల శ్రీరామ్, జేసీ అశ్మిత్‌రెడ్డి గడిచిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన విషయం తెలిసిందే. ఈసారి ఎన్నికల్లో ఆ ఇద్దరు యువ నేతలకు టిక్కెట్లు ఖరారు చేయాలనే నిర్ణయానికి అధిష్టానం వచ్చినట్లు తెలుస్తోంది. మాజీ మంత్రి, టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీ నేతగా పనిచేసి పార్టీలో తనదైన ముద్ర వేసుకున్న దివంగత రామచంద్రారెడ్డి కుమార్తె, పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మకు అవకాశమివ్వాలని పార్టీ భావిస్తోంది. గత ఎన్నికల్లోనూ సవితమ్మ టికెట్ ఆశించారు. ఈసారి ఎన్నికల్లో తప్పనిసరిగా పోటీ చేయించాలనే నిర్ణయానికి అధిష్టానం వచ్చినట్లు తెలుస్తోంది. టీడీపీలో మరో ముఖ్యనేత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి కుటుంబం నుంచి ఆయన కోడలు పల్లె సింధూర అభ్యర్థిత్వాన్ని పార్టీ అధిష్టానం నిశితంగా పరిశీలిస్తున్నట్లు పార్టీ ముఖ్య వర్గాల ద్వారా అందిన సమాచారం. అయితే పల్లె రఘునాథరెడ్డి రానున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

కుళ్లిన అంగన్‌వాడీ గుడ్లు



రాప్తాడు-2 అంగన్‌వాడీ కేంద్రంలో చెడిపోయిన గుడ్లు

రాప్తాడు, జనవరి 29: అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారం గ్రామ సచివాలయ సిబ్బంది సకాలంలో పంపిణీ చేయకపోవడంతో పాడైపోయాయి. కందిబ్యాళ్ల పుచ్చు పట్టి పురుగులు కనిపిస్తున్నాయి. గుడ్లు కుళ్లిపోయి దుర్వాసన వస్తున్నాయి. అంగన్‌వాడీ కార్యకర్తలు, వర్కర్లు తమకు జీతాలు పెంచాలని 40 రోజులకుపైగా విధులకు హాజరుకాకుండా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సమయంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహా రం పంపిణీ చేసే బాధ్యతను ప్రభుత్వం గ్రామ సచివాలయ సిబ్బందికి అప్పగించింది. సచివాలయ సిబ్బంది పౌష్టికాహా రం కొన్ని గ్రామాల్లో కొంతమందికి సకాలంలో పంపిణీ చేయలేదు. దీని వల్ల కొన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పౌష్టికాహారం పాడైపోయాయి. అం గన్‌వాడీ సిబ్బంది ఇటీవల విధుల్లోకి చేరారు. అనంతరం పౌష్టికాహారం పంపిణీ చేసేటప్పుడు కందిబ్యాళ్లు పుచ్చుపట్టి పురుగులు పడ్డాయి. గుడ్లు కుళ్లిపోయాయి. పాల ప్యాకెట్లు కూడా గడ్డ కట్టాయి. పాడైన పౌష్టికాహారాన్నే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బండమీదపల్లిలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో కొంత మంది లబ్ధిదారులకు పంపిణీ చేసిన కందిబ్యాళ్లు, గుడ్లు పాడైపోయాయి. రాప్తాడులోని 2వ అంగన్‌వాడీ కేంద్రంలో సచివాలయ మహిళా పోలీసు సకాలంలో గుడ్లు పంపిణీ చేయకపోవడంతో కుళ్లిపోయాయి. వర్కర్ విధుల్లోకి చేరిన తరువాత వాటిని గుర్తించి ఒక వైపు ఉంచారు. ఆ గుడ్లు నిరుపయోగమేనని పారేయాల్సిందేనని తెలిపారు.

తిరుపతి ఎంపీ సీటుకు కొత్త అభ్యర్థిని ప్రకటిస్తాం

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి

తిరుపతి, జనవరి 29(ఆంధ్రజ్యోతి): సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం తనపై చేసిన వ్యాఖ్యలను ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. అనంతపురంలో వచ్చేనెల మొదటివారంలో జరిగే వైసీపీ 'సిద్ధం' సభ ఏర్పాట్లపై చర్చించేందుకు పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో తిరుపతిలో సోమవారం సమావేశం జరిగింది. జన సమీకరణ ఏర్పాట్లపై వైసీపీ ఎమ్మెల్యేలతో, నాయకులతో మంత్రి చర్చించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. తిరుపతి ఎంపీగా ఆదిమూలం స్థానంలో కొత్త అభ్యర్థిని పార్టీ ప్రకటిస్తుందని అన్నారు. టికెట్లు రానివారిని ఇతర పదవులతో పార్టీ సంతృప్తిపరుస్తుందని అన్నారు. రాయలసీమలో అన్ని సీట్లనూ వైసీపీ గెలుచుకుంటుందన్నారు.

- పార్టీ ఆదేశిస్తే ఒంగోలుకు సిద్ధమే : మంత్రి రోజా


'ఆంధ్రజ్యోతి పత్రికకు నేనంటే చాలా ప్రేమ. ఒకసారి టికెట్ లేదంటారు. మరోసారి ఒంగోలు ఎంపీగా పోటీ చేస్తానంటారు. టీడీపీ, జనసేనకు నాయకులు లేక అభ్యర్థుల జాబితా విడుదల చేయలేకపోతున్నారు. నగరి నియోజకవర్గంలో పనిచేసుకుంటున్న నేను ఒంగోలుకు పోవాల్సిన అవసరం ఏముందో అర్థం కావడం లేదు. పార్టీ ఆదేశిస్తే ఒంగోలు ఎంపీగా పోటీ చేసేందుకు కూడా నేను సిద్ధమే' అని మంత్రి రోజా అన్నారు. తాను నామినేటెడ్ పదవులు అమ్ముకుంటున్నానని చంద్రబాబు ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీలో ఉన్నప్పుడు ఎవరి దగ్గరైనా ఒక్క రూపాయి తీసుకునివుంటే నిరూపించాలన్నారు. హైదరాబాద్‌లో ఉంటూ ఏపీలో రాజకీయాలు చేసే నాన్‌లోకల్ లీడర్లు ఎక్కువైపోయారంటూ ఎద్దేవా చేశారు.చంద్రబాబు, పవన్ మధ్యలో నాలుగో కృష్ణుడిలాగా షర్మిల ప్రవేశించిందన్నారు. రాష్ట్రాన్ని ముక్కలు చేసిన కాంగ్రెస్ పార్టీలో చేరి వైఎస్ కుటుంబాన్ని ముక్కలు చేస్తోందన్నారు. మంత్రి పెద్దిరెడ్డిపై ఎమ్మెల్యే ఆదిమూలం చేసిన వ్యాఖ్యలు కరెక్టు కాదన్నారు.

- పలువురు నేతలు డుమ్మా

రాయలసీమ పరిధిలోని పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, వైసీపీ కోఆర్డినేటర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. సీటు దక్కని ఎమ్మెల్యేలు మాత్రం డుమ్మా కొట్టారు.ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రి జయరాం,ఎంపీ గోరంట్ల మాధవ్, పూతలపట్టు, సత్యవేడు, మదనపల్లె ఎమ్మెల్యేలు ఎంఎస్ బాబు, ఆదిమూలం, నవాజ్ భాషా, తిప్పేస్వామి సమావేశానికి రాలేదు. అదే విధంగా జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట కేశవరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, రాజంపేట, కదిరి ఎమ్మెల్యేలు మేడా మల్లికార్జున్ రెడ్డి, సిద్దా రెడ్డి హాజరు కాలేదు. కొత్తగా నియమితులైన సమన్వయకర్తలు సమావేశంలో కనిపించారు.

పంట నష్టపరిహారం అందేనా..?!





- వర్షాభావంతో దెబ్బతిన్న పంటలు
- కోత సమయానికి ముందే పంటను దున్నేసిన రైతులు
- రూ.251.20 కోట్ల పంటనష్టం జరిగినట్లు ప్రతిపాదనలు
- సమీపిస్తున్న సార్వత్రిక ఎన్నికలు
- ఎన్నికల కోడ్ అమలైతే అంతే సంగతులు

అనంతపురం అర్బన్/యాడికి, జనవరి 29: కరువు రైతుకు పంటనష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఓ వైపు సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఎన్నికల కోడ్ అమలయ్యేలోగా పరిహారం మంజూరు చేస్తేనే ప్రయోజనం ఉంటుంది. లేదంటే కరువు రైతులకు పరిహారం అందడం కష్టమే. కేంద్ర కరువు బృందం జిల్లాలో పర్యటించి నెల రోజులు పూర్తయినా ఇప్పటి దాకా పరిహారం మంజూరుపై ప్రభుత్వం ఊసెత్తకపోవడం గమనార్హం. ప్రజాప్రతినిధులు సైతం ఈ విషయంలో నోరుమెదపకపోవడం విమర్శలకు తావిస్తోంది. తక్షణమే ప్రభుత్వం స్పందించి పంటనష్టపరిహారం మంజూరు చేసి అర్హులైన రైతుల ఖాతాలకు జమ చేయకపోతే ఇప్పట్లో పరిహారం అందడం కష్టమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కరువు రైతులు తమకు పరిహారం ఇస్తారో? లేదోనన్న ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. మరి ప్రభుత్వం ఏ మేరకు కరువు రైతుపై కనికరం చూపుతుందో వేచిచూడాల్సిందే.

గతేడాది ఖరీఫ్‌లో వర్షాభావంతో దెబ్బతిన్న పంటలు

2023-24 సంవత్సరం ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సాగు చేసిన పంటలకు దిగుబడి రాలేదు. వేరుశనగ, ఆముదం, పత్తి, కంది, జొన్న తదితర పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. వేరుశనగ పంట ఊడదశలో వర్షాభావంతో పంట దిగుబడి రాలేదు. ఈ పరిస్థితుల్లో పొలాల్లో కొన్ని చెట్లకు రెండు, మూడు కాయలు కాయగా, మరికొన్ని చెట్లకు కాయలే కాయలేదు. మరో వైపు వర్షాభావంతో పంటలు పొలాల్లోనే ఎండిపోయాయి. తమ కళ్లెదుటే పంట ఎండిపోవడంతో రైతులు చూడలేక అప్పట్లో దున్నేశారు. మరోసారి కరువు రైతు అప్పుల ఊబిలో కూరుకుపోయాడు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

1.79 లక్షల హెక్టార్లల్లో రూ.251.20 కోట్ల పంటనష్టం

ఈ ఏడాది ఖరీఫ్‌లో 28 మండలాల్లో 1.69 లక్షల మంది రైతులకు సంబంధించి 1.79 లక్షల హెక్టార్లల్లో రూ.251.20 కోట్ల పంటనష్టం జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ మేరకు ప్రభుత్వానికి కరువు నివేదికలు పంపారు. వర్షాభావ పరిస్థితుల్లో 33 శాతం కంటే ఎక్కువగా దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించారు. చిన్న, సన్నకారు రైతులు సాగు చేసిన విస్తీర్ణంలో ఐదెకరాలకు, పెద్ద రైతులకు గరిష్ఠంగా ఐదెకరాల దాకా పంటనష్టం అంచనాలు తయారు చేశారు.

మూడు మండలాల రైతులకు అన్యాయం

జిల్లాలో 31 మండలాలు ఉండగా... 28 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం గుర్తించింది. జిల్లాలో మిగిలిన యల్లనూరు, బెళుగుప్ప, బొమ్మనహాల్ మండలాలను జాబితాలో చేర్చలేదు. మిగతా మండలాల్లో తరహాలోనే ఆయా మండలాల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. తమ ప్రాంతాల్లోనూ వర్షాభావంతో పంటనష్టం జరిగిందని, కరువు మండలాలుగా ప్రకటించాలని ప్రభుత్వం, కేంద్ర కరువు బృందాన్ని బాధిత రైతులు వేడుకున్నా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. దీంతో ఆయా మండలాల రైతులకు ప్రభుత్వం అన్యాయం చేసినట్లైంది.

పంటనష్టపరిహారం అందించి ఆదుకోవాలి



గతేడాది ఖరీఫ్‌లో 4 ఎకరాల్లో కంది సాగు చేశా. 40 వేలకుపైగా పెట్టుబడికి ఖర్చు అయ్యింది. వర్షాభావంతో పంట పూర్తిగా ఎండిపోయింది. గొర్రెలు, పశువులకు పంటను వదిలేశా. వ్యవసాయ అధికారులు పొలంలోకి వచ్చి పంటనష్టం జరిగినట్లు నిర్ధారించారు. జాబితాలోనూ పేరు ఎక్కించారు. ఇప్పటి దాకా ఎలాంటి పరిహారం ఇవ్వలేదు. ప్రభుత్వం త్వరగా పరిహారం అందించి ఆదుకోవాలి.

- ఖాళీ విశ్వనాథ్, కమలపాడు, యాడికి మండలం

పరిహారం ఎప్పుడిస్తారో... ఏమో?




ఖరీఫ్‌లో 20 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. వర్షాలు సరిగా పడకపోవడంతో దిగుబడి రాలేదు. ఎకరాకు రూ.30వేలు దాకా పెట్టుబడి ఖర్చు అయ్యింది. వ్యవసాయ అధికారులు నిబంధనల పేరుతో ఐదెకరాల్లో పంట నష్టం జరిగినట్లు రాసుకొని వెళ్లారు. ఇప్పటి దాకా ఎలాంటి పరిహారం మంజూరు కాలేదు. పరిహారం డబ్బులు ఎప్పుడిస్తారో..? ఏమో అర్థం కావడం లేదు. ఎన్నికల కోడ్ వస్తే పంటనష్టపరిహారం మంజూరు చేసేందుకు అవకాశం లేదంటున్నారు. అప్పటిలోగా పరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- శంకర్‌రెడ్డి, చిక్కేపల్లి, యాడికి మండలం

తెనగల్లులో పేలిన గ్యాస్ సిలిండర్

- ఆరుగురికి గాయాలు... ఇల్లు నేలమట్టం
- రూ. పది లక్షలకు పైగా ఆస్తి నష్టం



పేలిన సిలిండర్

కుందుర్పి, జనవరి 29: మండలంలోని తెనగల్లు గ్రామంలోని ఓ ఇంటిలో సోమవారం సిలిండర్ పేలిన ఘటనలో ఇల్లు నేలమట్టమయ్యింది. ఈ సంఘటనలో ఆరుగురు గాయపడగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... తెనగల్లు గ్రామంలోని షేక్ ముస్తాబ్ ఇంట్లో రెండు గ్యాస్ సిలిండర్లను ఉంచాడు. రాత్రంగా ఒక సిలిండర్ లీక్ అవుతుండగా, ఉదయం కరెంటు బల్బును ముస్తాబ్ ఆన్ చేశాడు. వెంటనే పొగలు వ్యాపించడంతో బయటకు కేకలు పెడుతూ వచ్చాడు. చుట్టుపక్కల వారు సంఘటనా స్థలానికి చేరుకుని ఇంట్లో ఉన్న మరో సిలిండర్‌ను బయటకు తీసుకువచ్చారు. ఈ సమయంలో మరో సిలిండర్ పెద్దశబ్దంతో పేలింది. వెంటనే మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో బాధితుడికి సహాయం చేయడానికి వచ్చిన ఆరుగురు గాయపడ్డారు. వారిని 108లో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో సిద్దేశ్వర, చౌడప్పలను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భీమరాజు, నారాయణస్వామి, రామాంజనేయులు, మారుతిలకు స్వల్ప గాయాలు కాగా కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలానికి అడిషనల్ ఎస్పీ రామిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు, ఏఈ నాగరాజు, ఎస్ఐ వెంకటస్వామి చేరుకుని స్థలాన్ని పరిశీలించి గ్యాస్ పేలేందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుడు ముస్తాబ్ చిల్లర దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఘటనలో రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు తెలిపాడు. ఫైరింజన్ సమయానికి చేరుకోవడంతో సిబ్బంది మంటలను ఆర్పారు. రెస్క్యూ టీమ్ ఎక్స్‌కవేటర్ సహాయంతో రోడ్డుపై పడివున్న రాళ్లను తొలగించారు. అనంతరం పేలిన గ్యాస్ సిలిండర్‌ను పరిశీలించారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.



సిలిండర్ పేలుడు ధాటికి నేలమట్టమైన ఇల్లు

అసౌకర్యాల నడుమ

ఆడుకున్నారు..!

నియోజకవర్గ స్థాయిలో ముగిసిన ఆడుదాం ఆంధ్ర



ఎండలోనే నిల్చున్న విజేతలు

శింగనమల, జనవరి 29: మొదటి నుంచీ నియోజకవర్గంలో ఆడుదాం ఆంధ్ర పోటీల్లో క్రీడాకారులకు అధికారులు, పాలకులు ఎలాంటి సౌకర్యాలూ కల్పించకుండా వారితో ఆడుకున్నారు. వీరికి భోజనం సరికదా... కనీసం కూర్చోడానికి నీడ సౌకర్యమూ ఏర్పాటు చేయలేదు. నియోజకవర్గ స్థాయి పోటీలు సోమవారంతో ముగిశాయి. ఈ సభను శింగనమల జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించారు. కనీసం ఈ ముగింపు కార్యక్రమంలోనూ విజేతలు, క్రీడాకారు లకు ఎలాంటి సౌకర్యాలూ కల్పించలేదు. విజేతలు ఎండలోనే నిలబడి బహుమ తుల కోసం ఎదురు చూశారు. ముగింపు రోజైన వారికి భోజన సౌకర్యం అటుంచి.. కనీసం నీటి సౌకర్యమూ కల్పించలేదు. దీంతో విజేతలు, క్రీడాకారులు మరిన్ని ఇబ్బందులు పడ్డారు.

నేడు జాబ్‌మేళా

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 29: నిరుద్యోగ మహిళలకు మంగళవారం ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. ప్రముఖ మొబైల్, ఎలక్ట్రానిక్ తయారీ సంస్థలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి 18-26 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన మహిళలు అర్హులన్నారు. ఎంపికైన మహిళలకు నెలకు రూ.20వేలు వేతనం చెల్లిస్తామని, వివరాలకు 7780752418 నంబరులో సంప్రదించాలని సూచించారు.

బుడ్డప్పనగర్‌లో జనసేన మాటామంతి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 29: జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత సోమవారం బుడ్డప్పనగర్‌లో మహిళలతో మాటామంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. అక్కడి సమస్యలపై ఆరా తీశారు. మరోసారి జగన్‌రెడ్డిని గెలిపిస్తే రాష్ట్రం సర్వనాశనం కావడం ఖాయమన్నారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించి జనసేన, టీడీపీ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీర మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

నేడు సర్పంచ్‌ల నిరసన దీక్ష

శింగనమల, జనవరి 29: సర్పంచ్‌ల సమస్యలపై మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపడుతున్నామని పంచాయతీరాజ్ చాంబర్ సర్పంచుల సంఘం సభ్యుడు డేగల కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ వర్ధంతి సందర్భంగా తలపెట్టిన ఈ కార్యక్రమంలో సర్పంచులందరూ ఇందులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్యాస్‌పై అదనంగా వసూలు చేస్తే చర్యలు

అనంతపురం టౌన్ జనవరి 29: గ్యాస్ సిలిండర్ల సరఫరాలో అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవని జేసీ కేతన్‌గార్గ్ సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. 15 కిలో మీటర్ల వరకు ఉచితంగానే సిలిండర్ల సరఫరా చేయాల్సి ఉందని, కొందరు బాయ్స్ అదనంగా వినియోగదారులతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంట నమోదు తప్పనిసరి

గార్లదిన్నె, జనవరి 29: పంటలు సాగుచేసిన రైతులందరు తప్పని సరిగా ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏడీఏ రవి తెలిపారు. సోమవారం సిరివరం, కనుంపల్లి గ్రామాల్లో ఈ క్రాప్ బుకింగ్‌ను వ్యవసాయ అధికారి సోమశేఖర్‌తో కలసి పరిశీలించారు. ఈనెల ఆఖరిలోపు రైతు భరోసా సిబ్బందితో ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో యూరియా, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

అనంతపురం రూరల్, జనవరి 29: విద్యుత్ చార్జీలపై ప్రజా అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని అనంతపురం టౌన్, రూరల్ డివిజన్ల పరిధిలోని వినియోగదారుల కోసం జేఎన్‌టీయూ రోడ్డులోని ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. మొదటి రోజు ఇద్దరు వినియోగదారులు తెలుగుదేశం పార్టీకి చెందిన బాబాఫక్రుద్దీన్, శివప్రసాద్ హాజరై తమ అభిప్రాయాలను వర్చువల్ పద్ధతిలో ఏపీఈఆర్‌సీ చైర్మన్ జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డికి తెలిపారు. బాబాఫక్రుద్దీన్ మాట్లాడుతూ.. పాత పద్ధతిలోనే విద్యుత్ చార్జీలను అమలు చేయాలని, ప్రస్తుతం వివిధ రూపాల్లో విద్యుత్ బిల్లులు వినియోగదారులపై పెనుభారం మోపుతున్నారని, వాటిని తగ్గించాలని అన్నారు. వర్చువల్ పద్ధతిలో ప్రజాభిప్రాయసేకరణ కాకుండా గ్రామస్థాయిలో నిర్వహిస్తే వినియోగదారులకు తమ అభిప్రాయాలను తెలియజేసేందుకు మరింత సులువుగా ఉంటుందన్నారు. శివప్రసాద్ మాట్లాడుతూ.. విద్యుత్ పంపిణీ సంస్థలు సౌరవిద్యుత్ పలకల ఏర్పాటుకు సహకరించడం లేదన్నారు. రూఫ్‌టాఫ్ సౌరఫల ఏర్పాటుకు కేంద్రం రాయితీ ఇస్తోందని, అయితే ఇక్కడ వాటిని అమలు చేయడం లేదని అన్నారు. మూడేళ్లుగా సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు అమలు చేయాలని కోరుతున్నా పంపిణీ సంస్థలు పట్టించుకోవడం లేదన్నారు.

పీవీకేకే ఐటీ డిప్లమాలో 'స్వాధ్యాయ'

అనంతపురంరూరల్, జనవరి 29: ఆలమూరు రోడ్డులోని పీవీకేకే ఐటీ డిప్లమాలో స్వాధ్యాయ -2024 పేరిట ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబి షన్ జేసీ కేతన్ గార్గ్ సోమవారం ప్రారంభించారు. ఇందులో విద్యార్థులు ప్రద ర్శించిన నమూనాలను పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ... విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్లు ఎంతో దోహ దప డుతాయన్నారు. చైర్మన్ పల్లెకిశోర్, ప్రిన్సిపల్ వైభవ్ మాట్లాడుతూ.. ఏటా స్వాధ్యాయ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఇక్కడ విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు రాష్ట్రస్థాయి పోటీల్లో బహుమతులు సాధిస్తున్నాయని అన్నారు. ఈ ఏడాది 151 నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవ రాయ విశ్వవిద్యాలయం కామర్స్ ప్రొఫెసర్ వెంకట రమణ, కళాశాల యాజ మాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, అకడమిక్ డీన్ సంతోష్‌కుమార్‌రెడ్డి, శ్రీబాలా జీ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ మేనేజర్ అనురాగ్‌రెడ్డి పాల్గొన్నారు.



సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న జేసీ కేతన్‌గార్గ్

పనిచేయని సీసీ కెమెరాలు

చోరీలు జరుగుతున్నా నిద్రవీడని పోలీసులు

అనంతపురం క్రైం, జనవరి 29: నగరంలో సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో చోరీలకు అడ్డూ అదుపు లే కుండా పోతోంది. పోలీస్ అధికారుల పర్యవేక్షణ లోపమే ఇందుకు ప్రధాన కారణం. తాడిపత్రి వైపు నుంచి అనంతపురం నగరంలోకి ప్రవేశించే ప్రధాన రహదారిలోని సీసీ కెమెరాలే పనిచేయడం లేదంటే పరిస్థితి దారుణంగా ఉందో అర్థమవుతుంది. ఆది వారం ఆ ప్రాంతంలో (చెరువుకట్ట ఎదుట) ఉంచిన బొలెరో వాహనం టైరు చోరీకి గురైంది. బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడి సీసీ కెమెరాలు పనిచేయడం లేదని సీసీ కెమెరాల కంట్రోల్ రూమ్ పోలీసులు చెప్పారు. ఆరు నెలల క్రితం అదే ప్రాంతంలో ఓ సుమో చోరీకి గురైంది. అప్పుడూ సీసీ కెమెరాలు పనిచే యకపోవడంతో ఆ వాహనం ఆచూకీ నేటికీ లభించలేదు. పాతూరు పరిధిలో సీసీ కెమెరాలు లేకపోవడం.. ఉన్నా అవి పనిచేయక పోవడం వాహనచోరులకు వరమైంది. నగరంలోని చాలా ప్రాంతాల్లో సీసీ ఫుటేజీలు లేకపోవడంతో దొంగలను గుర్తించలేని పరిస్థితి నెలకొంది. పోలీసులు ఏర్పాటు చేయని ప్రాంతాల్లో, స్థానిక వ్యాపారులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విషయంలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికైనా పోలీసులు పలుప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, పనిచేయని వాటికి మరమ్మతులు చేయించాలని నగరవాసులు కోరుతున్నారు.



చెరువు కట్ట వద్ద ప్రధాన రహదారిలోని సీసీ కెమెరాలు

అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకోండి

రాప్తాడు, జనవరి 29: రాప్తాడు గ్రామ పంచాయతీ పరిధిలోని అక్రమ లే అవుట్లపై కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలని రాప్తాడు టీడీపీ సర్పంచ్ సాకే తిరుపాలు డిమాండ్ చేశారు. రాప్తాడులోని గ్రామ సచివాలయంలో సోమవారం పంచాయతీ వార్డు సభ్యులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ పరిధిలో వందకు పైగా ఎకరాల్లో అహుడా అనుమతి లేకుండా ఇష్టానుసారంగా వెంచర్లు వేసి ప్లాట్లు విక్రయిస్తున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా మొత్తం భూమిని విక్రయించి సొమ్ము చేసుకుం టున్నారన్నారు. ల్యాండ్ కన్వర్షన్ కూడా లేకుండా ప్లాట్లు విక్రయిస్తున్నా అధికారులు ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. ఈ అక్రమాలపై పత్రికల్లో కథనాలు వస్తున్నా మండల స్థాయి అధికారుల్లో చలనం లేదన్నారు. రెండేళ్ల నుంచి రిజిస్టర్ స్టాంప్ ఫీజు కూడా గ్రామ పంచాయతీ ఖాతాకు జమ కావడం లేదన్నారు. దీంతో పంచాయతీ నష్టం వాటిల్లుతోందని, అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని, కనీసం పారిశుధ్య కార్మికులకు జీతాలు కూడా సక్రమంగా ఇవలేకపోతున్నామని వాపోయారు. అక్రమ లేఅవుట్లపై ఆధారాలతో కలెక్టర్, డీపీఓ, డీఎల్‌పీఓకు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చంద్రకళ, మాధవిలత, రేణుక, రాజు, రమాదేవి, గ్రామస్థులు గేటు సత్తి, మహేష్, శివ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ సర్పంచ్ సాకే తిరుపాలు

ప్రకృతి వ్యవసాయం పరిశీలన

రాప్తాడు, జనవరి 29: మండలంలోని మరూరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతు బాలముద్దన్న సాగుచేసిన మామిడితోటను రిటైర్డ్ ఐఏఎస్ విజయ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో వాడుతున్న ఇన్పుట్ బీజీమృతం, ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, సీడ్ పెలటైజేషన్ చేయు విధానాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి లక్ష్మానాయక్ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలు సాగు చేయు విధానాన్ని వివరించారు. పంటల సాగుకు పూర్వ కాలం పద్ధతులు పాటించాలన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి.. సేంద్రీయ ఎరువులు అధికంగా వాడాలన్నారు. వారి వెంట ప్రకృతి వ్యవసాయ బృందం సభ్యులు షేక్ మజీద్, వాల్టర్ లింక్, నలిని కిషోర్, దేశ్‌దీప్, సహదేవ్, అశోక్ ఉన్నారు.

అదృశ్యం కేసులు పట్టని వైసీపీ

అనంతపురం సెంట్రల్, జనవరి 29: దళిత, గిరిజన వర్గాల ప్రజల అదృశ్య కేసులను విస్మరిస్తూ బాధితులను పొట్టన పెట్టుకుంటోందని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకేహరి వైసీపీ ప్రభుత్వంపై మండిపడ్డారు. సోమవారం ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... తమ కుటుంబ సభ్యులు అదృశ్యమయ్యారని బాధితులు పోలీసులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదన్నారు. దీంతో అదృశ్యమైన వారు హత్యలకు గురవుతున్నారని మండిపడ్డారు. స్నేహలత, రమాదేవి హత్యలే ఇందుకు సాక్ష్యమన్నారు. తాజాగా జయమ్మ అనే మహిళ కూడా హత్యకు గురైందన్నారు. జయమ్మను తాడిపత్రి ప్రాంతానికి చెందిన రవీంద్రారెడ్డి కులాంతర వివాహం చేసుకుని దారుణంగా హత్య చేసి పూడ్చిపెట్టారన్నారు. తమ కూతురు అదృశ్యమైందని గతేడాదే జయమ్మ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. రవీంద్రారెడ్డిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వరయ్య, రామకృష్ణ, నారాయణస్వామి, ఓబులేసు, మల్లయ్య, గోవింద్ పాల్గొన్నారు.

కూడేరు ఎస్‌ఐపై ఎస్పీకి ఫిర్యాదు

అనంతపుం క్రైం, జనవరి 29: పొలం రస్తా విషయంలో కూడేరు ఎస్‌ఐ సత్యనారాయణ తీరుపై అదే మండలంలోని కడదరకుంటకు చెందిన నారాయణస్వామి, భార్య గోవిందమ్మ, సోదరి లక్ష్మీదేవి సోమవారం ఎస్పీ అన్బురాజన్‌కు ఫిర్యాదు చేశారు. లక్ష్మీదేవికి చెందిన భూమిలోకి వెళ్లడానికి రస్తా ఉన్నా.. పక్కపొలం వారు వెళ్లనివ్వడం లేదని, ఈ విషయంలో కూడేరు ఎస్‌ఐ న్యాయం చేయకుండా వారికే మద్దతిస్తున్నారని ఆరోపించారు. స్టేషన్‌కు పిలిపించి బూతులు తిట్టారని, వారి కాళ్లు పట్టుకో దారి ఇస్తాడని ఎస్‌ఐ బెదిరించారని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

బాల పురస్కార గ్రహీతకు సన్మానం



విద్యార్థి సూర్యప్రసాద్‌ను సన్మానిస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, జనవరి 29: రాష్ట్రీయ బాల పురస్కార అవార్డు గ్రహీత విద్యార్థి సూర్యప్రసాద్‌ను సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, అసెంబ్లీ కన్వీనర్ గొంది అశోక్‌కుమార్ విద్యార్థి ప్రకాష్‌ను సత్కరించారు. చిన్న వయసులోనే హిమాద్రిపైకెక్కి జిల్లాఖ్యాతిని చాటాడని వారు కొనియాడారు.

పలువురు సీఐల బదిలీ

అనంతపురం క్రైం : పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం వీఆర్‌లో ఉన్న క్రాంతికుమార్‌ను అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు. వీఆర్‌లో ఉన్న ఎస్.రోషన్‌ను యాడికి సీఐగా, వీఆర్‌లో ఉన్న కె.జనార్దన్‌ను అనంతపురం సీసీఎస్‌కు, వీఆర్‌లో ఉన్న డీ.మునిస్వామిని రాప్తాడు యూపీఎస్‌కు కేటాయిం చారు. టూటౌన్ సీఐ శివరాముడును కూడేరు యూపీఎస్‌కు బదిలీ చేశారు.

బాబు భూములిస్తే.. జగన్ ఆక్రమించాడు

అనంతపురం సెంట్రల్, జనవరి 29: టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు భూమికొనుగోలు పథకం ద్వారా దళితులకు వ్యయసాయ భూమిలిచ్చాడని, అయితే వైసీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ వాటిని ఆక్రమించుకుంటున్నాడని ఎమ్మార్పీ ఎస్ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో భూమి కొనుగోలు పథకం లబ్ధిదారులతో ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం ముందు నిరసన చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖల కుంట రామాంజినేయులు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలోని ఎస్సీలకు టీడీపీ ప్రభుత్వంలో వందల ఎకరాల వ్యవసాయ భూములిచ్చి పాస్‌పుస్తకాలను అందజేసిందన్నారు. ఇందులో భాగంగా గుత్తి నియోజకవర్గం పెద్దొడ్డి గ్రామంలో సర్వే నంబరు 149లో 18 ఎకరాల భూమిని 26మంది ఎస్సీలకు ఇచ్చారన్నారు. ఆ భూములను కాజేసేం దుకు వైసీపీ నాయకులు లబ్ధిదారులను భయభ్రాంతులకు గురిచేస్తూ అరాచకాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. లబ్ధిదారులకు తక్షణ మే పూర్తిస్థాయి భూహక్కును కల్పించి రిజిస్ట్రేషన్ చేయిం చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఇర్ఫాన్, గురుస్వామి, రామాంజనేయ, రత్నమ్మ, శివలక్ష్మి, లక్ష్మీదేవి, సుంకమ్మ, పాల్గొన్నారు.

'అనంత' రైతును ఆదుకోవడంలో విఫలం

అనంతపురం విద్య, జనవరి 29: రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం జిల్లాలో కరువు రైతును ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఏపీ రైతు సంఘం నాయకులు మండిపడ్డారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన ఆ సంఘం రాప్తాడు నియోజకవర్గ స్థాయి సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం రైతులకు కనీసం పంట నష్టపరిహారం కూడా ఇవ్వకుండా సీఎం జగన్ కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. కరువు మండలాల్లో ఇప్పటి వరకూ ఎలాంటి సహాయక చర్యలూ చేపట్టలేదని, ఇప్పటికైనా పాలకు లు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రామకృష్ణ, శ్రీకాంత్, రమేష్, పోతులయ్య, రామాంజినేయులు, వన్నారెడ్డి, రామక్రిష్ణ, వెంకటనారాయణ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 29: నాసిరకం కళింగర విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని విత్తనాల దుకాణం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... నార్పల మండలం బండ్లపల్లిలో 8 మంది రైతులు 25 ఎకరాల్లో అప్పులు చేసి మ్యాక్స్ కంపెనీ బీఎస్ఎఫ్ కళింగర విత్తనాలు కొనుగోలు చేశారన్నారు. నాసిరకం విత్తనాల మూలంగా పంట దిగుబడి రాలేదన్నారు. దీనిపై వ్యవసాయ అధికారులు స్పందించి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, ఆనంద్, బాధిత రైతులు వెంకటనారాయణరెడ్డి, మల్లేశ్వరమ్మ, లక్ష్మినారాయణ, మధుసూదన్ రెడ్డి, మల్లిరెడ్డి పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి

అనంతపురం సెంట్రల్, జనవరి 29: సంత్ శ్రీసేవాలాల్ జయంతి రోజును సెలవు దినంగా ప్రకటించాలని జీపీఎస్ నాయకులు మల్లికార్జున నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లాకు వచ్చిన ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, విజయకుమార్, మహేష్ పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న సంస్థ ప్రతినిధులు

ఘనంగా స్వరాజ్ ట్రాక్టర్ల స్వర్ణోత్సవం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 29: స్వరాజ్ ట్రాక్టర్స్ సంస్థ 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గుత్తిరోడ్డులోని స్వరాజ్ ట్రాక్టర్స్ డీలర్ శ్రీ విజ య ట్రాక్టర్ ఏజెన్సీస్ షోరూంలో నిర్వహించిన వేడుకలకు ముఖ్య అతిథులుగా సంస్థ టెరిటరీ మేనేజర్ మనోజ్, సర్వీస్ మేనేజర్ సునీత హాజరయ్యారు. వారు మాట్లాడుతూ... వ్యవసాయంలో స్వరాజ్ ట్రాక్టర్ల పాత్ర మరువలేనిదన్నారు. రైతు ల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ట్రాక్టర్లలో మార్పులను తమ సంస్థ చేస్తోందన్నారు. స్థానిక డీలర్ శ్రీవిజయ ట్రాక్టర్ ఏజెన్సీస్ యాజమానులు మాలతి శ్రీనివాస్, తేజస్వి మాట్లాడుతూ... 35 సంవత్సరాలుగా ఆదరిస్తున్న స్వరాజ్ వినియోగదారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ విజయకుమార్, సుబ్రమణ్యం, చిన్నా, సిబ్బందితో పాటు రైతులు, కస్టమర్లు పాల్గొన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన వడ్డెర్ల సంఘం నాయకులు



అనంతపురం అర్బన్, జనవరి 29: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్‌ను ఉండవల్లిలోని నివాసంలో సోమవారం కలిసినట్లు అనంత ఉమ్మడి జిల్లా వడ్డెర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దళవాయి వెంకటనారాయణ తెలిపారు. తనవెంట ఉపాధ్యక్షుడు సిమెంట్ పోలన్న, నాయకులు జరిపిటి కృష్ణమూర్తి, గంగన్న, లక్ష్మీపతినాయుడు, పుల్లన్న ఉన్నట్లు తెలిపారు.

సంసిద్ధ్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి



డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జనవరి 29: విద్యార్థులను రక్తం వచ్చేలా, శరీరం కమిలిపోయేలా కొట్టినా.... సంసిద్ధ్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ సంఘాల నాయకులు డీఈఓ ఆఫీస్ వద్ద ఆందోళన చేశారు. విద్యా సంస్థను బార్‌గా మార్చేసినా.... విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని, సంసిద్ధ్ స్కూల్‌ను వెంటనే సీజ్ చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఒకే క్యాంపస్‌లో గర్ల్స్, బాయ్స్‌కు హాస్టల్ అనుమతి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపాల్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులే కోరుతున్నారన్నారు. తగిన ఆధారాలతో ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు దృష్టికి తీసుకొచ్చినా ఎలాంటి చర్యలూ తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆయన వెంటనే రాజీనామా చేయాలని, లేకుంటే ఈ పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎస్ అధ్యక్షుడు రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు వంశీ, మంజు, పవన్, హరి, విశ్వ, రారాజు, శామ్యూల్, ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్ధు, గిరి, భీమేష్, సోము, చంద్రకాంత్, నందన్ పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

రామగిరి, జనవరి 29: టాటా ఇండికా కారులో రూ.1,15,120 విలువైన 30 కేసుల కర్ణాటక మద్యాన్ని ఇద్దరు వ్యక్తులు తరలిస్తుండగా మండలంలోని ఎగువపల్లి చెక్‌పోస్టు వద్ద రామగిరి పోలీసులు ఆదివారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇద్దరు వ్యక్తులు కారును వదిలేసి పారిపోయారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జనార్ధన్‌నాయుడు తెలిపారు.

ఆర్ కొత్తపల్లిలో న్యాయసేవా సదస్సు

రామగిరి, జనవరి 29: మండలంలోని ఆర్‌కొత్తపల్లి గ్రామంలో మహిళా శక్తి సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత న్యాయసేవా సదస్సు నిర్వహించారు. మద్యపాన నిషేధం, గృహ హింస, మహిళ చట్టాలు, వరకట్న వేధింపులు తదితర వాటిపై సొసైటీ అధ్యక్షురాలు వహీద, సీఈఓ కవిత అవగాహన కల్పించారు. వీటిపై నాటకాన్ని ప్రదర్శించి మహిళలను చైతన్య పరిచారు. కార్యక్రమంలో మహాశక్తి సీఈఓ రమీజా, సొసైటీ పాలక వర్గసభ్యులు పాల్గొన్నారు.

నేడు కర్ణాటక సంగీత కచేరి

అనంతపురం కల్చరల్, జనవరి 29: స్థానిక మొదటిరోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో మంగళవారం సాయంత్రం ఆరుగంటలకు కర్ణాటక సంగీత కచేరి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మొదలి మురళీకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. త్యాగరాజస్వామి 177వ ఆరాధనోత్సవాలను పురస్కరించుకుని విజయవాణి సంగీత కళానిలయం ఆధ్వర్యంలో దీన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం త్యాగరాజస్వామికి ప్రత్యేక పూజలు, సాయంత్రం బెంగుళూరుకు చెందిన సంగీత విద్వాంసులు అభిరామ్ బృందం కర్ణాటక శాస్త్రీయ సంగీత కచేరి ఉంటుందని అన్నారు.

ఏటీఎల్ వర్క్‌షాప్ ప్రారంభం

అనంతపురం విద్య, జనవరి 29 : అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్) మూడు రోజుల వర్క్‌షాప్‌ను నెంబర్-2 స్కూల్‌లో ఇన్‌చార్జ్ డీఈఓ నాగరాజు సోమవారం ప్రారంభించారు. విజ్ఞాన్ ఆశ్రమానికి చెందిన మనోజ్, కృష్ణ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర యునిసెఫ్ కో-ఆర్డినేటర్ సుదర్శన్, సైన్స్ అధికారి బాలమురళీకృష్ణ, ప్రధానోపాధ్యాయులు నవీదా, ఉపాధ్యాయులు, గార్లదిన్నె, పామిడి, రాప్తాడు మోడల్ స్కూళ్లకు చెందిన 25 మంది విద్యార్థులు, కురుగుంట అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

అనంతపురం అర్బన్, జనవరి 29: పశుసంవర్ధక సహాయకుల పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగింది. పశుసంవర్ధక శాఖ జేడీ కార్యాలయంలో సోమవారం రెండో దశలో 240 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఇదివరకే పశుసంవర్ధక సహాయకులుగా పనిచేస్తున్న సిబ్బందికి మంగళవారం బదిలీల కోసం కౌన్సెలింగ్ ఉంటుందని జేడీ తెలిపారు. సిబ్బంది బదిలీల తర్వాత కొత్తవారికి పోస్టింగ్‌లు ఇస్తామన్నారు.

రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలి: దివ్యాంగులు

అనంతపురం టౌన్, జనవరి 29: 'ప్రస్తుతం నిత్యావసరాల ధరలన్నీ భారీగా పెరిగాయని, అయినా తమకు పింఛన్ రూ. 3 వేలే వస్తోందని, దాన్ని రూ. 6 వేలకు పెంచా లని దివ్యాంగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టరేట్‌లో స్పందనకు వచ్చి కలెక్టరు గౌతమికి వినతి పత్రం అందజేశారు. వివాహ పారితోషకం చాలా మందికి పెండింగ్ ఉందని, వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వసంతకుమార్, నాయకులు గంగన్న, రామాంజినేయులు, భాగ్యలక్ష్మి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

'స్పందన'కు 450 వినతులు..

కలెక్టరేట్ సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి మొత్తం 450 వినతులు వచ్చాయి. కలెక్టరు గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, జడ్పీసీఈఓ వైఖోమ్ నిదియా, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, సమగ్ర శిక్ష ఏపీసీ వరప్రసాద్, డిప్యూటీ కలెక్టరు ఆనంద్, డీఎల్‌డీఓ ఓబులమ్మ బాధితుల నుంచి ఆ ఫిర్యాదులు స్వీకరించారు.

శ్మశానంలోకి మురుగునీరు వస్తోంది...

రాప్తాడు : రాప్తాడు గ్రామంలోని ముస్లింల శ్మశాన వాటికలోకి మురుగు నీరు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ముస్లింలు కోరారు. ఈ మేరకు సోమవారం రాప్తాడులో తహసీల్దార్ మునివేలుకు, ఎంపీడీఓ సాల్మన్‌రాజ్‌కు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో షేక్షావలి, నూర్ బాషా, నబీ, రఫి, ఉసేనప్ప, ఖాజాపీరా పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద దివ్యాంగులు

ఎకరాకు రూ.50 వేలు పంటనష్ట పరిహారమివ్వాలి

గార్లదిన్నె, జనవరి 29: పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 50వేలు పరిహారం అందచేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం, సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వర్షాలకు రైతులు సాగుచేసిన వేరుశనగ, మొక్కజొన్న, కంది, వరి, ఆముదం తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. రైతులను ఆదుకుంటామని సీఎం హామీ ఇచ్చినా నేటికీ పరిహారం అందలేదన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీని తక్షణమే విడుదల చేయాలన్నారు. అదేవిదంగా ఉపాధి కూలీలకు 200 రోజులు పనులు కల్పించాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునకు వినతి పత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నాగమ్మ, నల్లప్ప, రాము, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

అనంతపురంరూరల్ : గత ఏడాది ఖరీఫ్‌లో అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ సొమ్మును వారి ఖాతాల్లోకి జమ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఇన్సురెన్స్ వెంటనే ప్రకటించాలని, ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని అన్నారు. ఉపాధి పనిదినాలను 200 రోజులకు పెంచాలని, రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నాగమణి, మండల కార్యదర్శి రామాంజినేయులు, వెంకట నారాయణ, నగర నాయకులు వరలక్ష్మి, మసూద్, నూరుల్లా, వెంకటేష్, మండల నాయకులు పుష్పరాజ్, ఓబులయ్య, వెంకటరాముడు, వన్నూరప్ప పాల్గొన్నారు.

శింగనమల: పంట నష్టపోయిన రైతుకు ఎకరానికి రూ50 వేలు అందజేయాలని మండల సీపీఎం కార్యాదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఎర్రిస్వామి, అంజనేయలు, శ్రీనివాసులు, ఓబిలేసు, నల్లప్ప పాల్గొన్నారు.



గార్లదిన్నెలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ఆందోళన

తాగేందుకు గుక్కెడు నీరివ్వండి

ఖాళీ బిందెలతో ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయింపు



ఖాళీ బిందెలతో బైఠాయించిన మహిళలు

కళ్యాణదుర్గం, జనవరి 29: తాగేందుకు గుక్కెడు నీరివ్వండి అంటూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలు చేతపట్టుకుని మహిళలు బైఠాయించారు. కంబదూరు మండల పరిషత్ కార్యాలయం ఎదుట కోటా కాలనీకు చెందిన మహిళలు సోమవారం ఖాళీ బిందెలు చేత పట్టుకుని ఆందోళన వ్యక్తం చేశారు. గత 20 రోజులుగా బిందెడు నీటి కోసం అష్టకష్టాలు పడాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్లిస్తారా లేదా అంటూ కార్యాలయం ఎదుటే భీష్మించుకుని కూర్చున్నారు. మా కాలనీకు నీరు వదలకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో సుధాకర్ రాజుకు వినతిపత్రం అందజేశారు.

పరిశీలన

ఇసుక దిబ్బల్లో పంటల సాగుపై చర్చ



ఇసుక దిబ్బలలో పరిశీలిస్తున్న ఏపీసీఎన్ఎఫ్, ఎన్ఆర్ఓ బృందం

బొమ్మనహాళ్, జనవరి 29: మండలంలోని గోవిందవాడ, కళ్లదేవనహళ్లి గ్రామాల శివారులోని ఇసుక దిబ్బలలో సాగైన పంటలను పలువురు అధికారులు సోమవారం పరిశీలించారు. సాగు విధానం చర్చించారు. ఏపీసీఎన్ఎఫ్, ఎన్ఆర్ఓ బృందం రిటైర్డ్ ఐఏఎస్ టీ విజయ్ కుమార్, షేక్ మజీద్, నలీన్ కిషోర్, జేష్‌దీప్ సహదేవ్, అశోక్, శ్యాముల్ ఆనంద్, రాష్ట్ర సీపీ అండ్ ఐఓ డీపీఎం లక్ష్మా నాయక్‌లతో కలిసి ప్రకృతి వ్యవసాయ పద్ధతి లో ఇసుక దిబ్బలలో సాగుచేసిన పంటలను పరిశీలించారు. రైతులు వన్నూరుస్వామి, రాజు, మల్లికార్జున, మల్లప్పలు సాగు చేసిన పంటల గురించి వారిని ప్రశ్నించారు. ఆదాయం వచ్చే పంటలను సాగుచేసే విధానం గురించి చర్చించారు. కంది, ఆముదం, అలసంద, అనుములు, గోరుచిక్కుడు, సజ్జ విత్తనాలతో ఘనజీవామృతంతో పాటు విత్తనాలు విత్తుకునే విషయాలపై ఆదాయం పొందే విధానాల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఓ బృందం విజయకుమార్, ఏఓ కృష్ణచైతన్య, డీఎల్ఎంపీ నరేంద్రకుమార్, జిల్లా కోఆర్డినేటర్ భానుమతి తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాపన

పంట నష్ట పరిహారం ఇవ్వాలి: సీపీఎం



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

డీ.హీరేహాళ్, జనవరి 29: గత ఖరీఫ్, రబీ సీజన్‌లలో పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి లోకేష్, సీపీఎం మండల కార్యవర్గ సభ్యులు మల్లికార్జున తహసీల్దార్ బాల ఈశ్వర్‌రెడ్డికి విన్నవించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి సోమవారం వెళ్లి తహసీల్దార్‌ను కలిసి సమస్యలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది రెండు సీజన్‌లలో వర్షాభావం వల్ల అన్ని రకాల పంటలు రైతులు నష్టపోయినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా వేరుశనగ, జొన్న, మొక్కజొన్న, పత్తి, కంది, ఆముదం పంటలు సాగు చేసిన రైతులు పెద్ద ఎత్తున నష్టపోయినట్లు వివరించారు. హెచ్చెల్సీ, హంద్రీనీవా కింద సాగు అయిన పంటలకు నీరు అందకపోవడంతో వరి, మిరప పంటలు ఎండిపోయాయని తెలిపారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు పంటల పెట్టుబడి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలు రైతులకు న్యాయం చేసే విధంగా లేవని వీటిని సవరించాలని సూచించారు.

నాటి బీమా ధీమా నేడు ఏదీ?: కాలవ



సెల్ఫీ దిగుతున్న మాజీ మంత్రి కాలవ

రాయదుర్గం, జనవరి 29: నిరుపేద కుటుంబాల్లో మరణాలు సంభవించినపుడు చంద్రన్న బీమా ఆర్థిక భరోసా కల్పించిందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. తన 50 వారాల సెల్ఫీ చాలెంజీలో భాగంగా గుమ్మఘట్ట మండలం కలుగోడు గ్రామంలో చంద్రన్న బీమా లబ్ధిదారులతో 42వ సెల్ఫీ దిగారు. దాన్ని సోమవారం విడుదల చేశారు. టీడీపీ పాలనలో 2014-19 మధ్య కాలంలో అనంతపురం జిల్లాలో ప్రమాదంలో, సహజంగా మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.242.50 కోట్ల ఆర్థిక సాయం చేసి ఆదుకున్నట్లు వివరించారు. అబద్ధపు వాగ్దానాలతో గెలిచిన జగన్‌మోహన్‌రెడ్డి చంద్రన్న బీమాను, వైఎస్సార్ బీమాగా మార్చాడని ఆరోపించారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో జిల్లాకు వైఎస్సార్ బీమా కింద రూ. 58 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో టీడీపీ పాలనలో చంద్రన్న బీమా ద్వారా రూ. 12.60 కోట్లు ఆర్థిక సాయం అందించా మన్నారు. ఇలాంటి పథకాలు కొనసాగాలంటే ఈ రాష్ట్రానికి టీడీపీ, జనసేన కూటమి చాలా అవసరమని తెలిపారు. వైసీపీ పాలనలో ప్రభుత్వ సాయం అందక చాలా మంది బాధితులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

గన్నెవారిపల్లిలో పర్యటించిన జేసీ అశ్మిత్‌రెడ్డి



మహిళతో మాట్లాడుతున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి29: మండలంలోని గన్నెవారిపల్లి కాలనీలో సోమవారం టీడీపీ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. టీడీపీ అధికారంలోకి వస్తే చేసే పనుల గురించి వివరించారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ, టీడీపీ నాయకులు చింబిలి ప్రసాద్‌నాయుడు ఉన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ మద్దతుదారులు

స్థానిక నివాసంలో సోమవారం రాత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో పలువురు వైసీపీ మద్దతుదారులు టీడీపీలో చేరారు. టీడీపీ సీనియర్ నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైసీపీ మద్దతుదారులు జేసీ ప్రభాకర్‌రెడ్డి నివాసానికి వచ్చారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పెద్దపుల్లయ్య, చిన్నపుల్లయ్య, కంబగిరి, నడిపి కంబగిరి ఉన్నారు.

రైతులను విస్మరించిన వైసీపీ ప్రభుత్వం



కూలీలతో బండారు శ్రావణిశ్రీ

యల్లనూరు, జనవరి29: వైసీపీ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని శింగనమల నియోజకవర్గ టీడీపీ నాయకురాలు బండారు శ్రావణిశ్రీ తెలిపారు. మండలంలోని కొత్తపల్లి, శింగవరం గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా పొలాల వద్ద రైతులను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతు సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని తెలిపారు. అనంతరం టీడీపీ ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఆమె వెంట మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రాయదుర్గంటౌన్, జనవరి 29: కుటుంబ కలహాల కారణంగా పట్టణంలోని సిద్దేశ్వరకాలనీకి చెందిన మల్లికార్జున(39) రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించాడు. ప్రమాదంలో అతని రెండు కాళ్లు తెగిపడ్డాయి. గాయపడ్డ అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మల్లికార్జునకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. గత మూడేళ్లుగా మల్లికార్జున ఎలాంటి పనిచేసేవాడు కాదు. భార్య ఇంటింటికి వెళ్లి కూలి చేసి కుటుంబాన్ని పోషించుకునేది. దీంతో భార్య భర్తల మధ్య మనస్పర్థలు తలెత్తినట్లు సమాచారం. ఘటనపై గుంతకల్లు రైల్వేపోలీసులకు వైద్యులు సమాచారం అందించారు.

జిల్లాలో పలువురు సీఐల బదిలీ

అనంతపురం క్రైం, జనవరి 29: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి సోమవారం ఉత్వర్వులు జారీ చేశారు. అనంతపురం వీఆర్‌లో ఉన్న క్రాంతికుమార్‌ను అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు కేటాయించారు. వీఆర్‌లో ఉన్న ఎస్.రోషన్‌ను యాడికి సీఐగా, వీఆర్‌లో ఉన్న కె.జనార్దన్‌ను అనంతపురం సీసీఎస్‌కు, వీఆర్‌లో ఉన్న డి.మునిస్వామిని రాప్తాడు యూపీఎస్‌కు కేటాయించారు. టూటౌన్ సీఐ శివరాముడును కూడేరు యూపీఎస్‌కు బదిలీ చేశారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి: సందిరెడ్డి



బీజేపీలో చేరుతున్న ముద్దలాపురం గ్రామస్థులు

కూడేరు, జనవరి 29: భారతీయ జనతా పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, ఆ పార్టీ ఉరవకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొనకొండ్ల రాజేష్ అన్నారు. మండలంలోని ముద్దలాపురంలో సోమవారం పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ నియోజకవర్గంలో బలపడుతోందని వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చాటుతామని పేర్కొన్నారు. అనంతరం ముద్దలాపురం గ్రామానికి చెందిన 20 కుటుంబాలు బీజేపీలోకి చేరడంతో వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రైల్వే బ్రిడ్జి అనుమతులపై వైసీపీ అసత్య ప్రచారం: మాజీ ఎమ్మెల్యే



ధర్మవరం గేట్ వద్ద మాట్లాడుతున్న జితేంద్రగౌడు

గుంతకల్లుటౌన్, జనవరి 29: పట్టణంలోని ధర్మవరం గేట్ వద్ద బ్రిడ్జి అనుమతులు మావల్లే వచ్చాయని వైసీపీ నాయకులు ప్రచారం చేసుకోవడం తగదని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు పేర్కొన్నారు. పట్టణంలోని ధర్మవరం రైల్వేగేట్‌ను, అక్కడ ఉన్న దుకాణాలను సోమవారం టీడీపీ, సీపీఐ నాయకులు సందర్శించారు. గేట్ పక్కన ఉన్న దుకాణదారులతో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా జితేంద్రగౌడు మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రజల ప్రయాణం ఇబ్బందికరంగా ఉండటం, ట్రాఫిక్ రద్దీగా ఉండే ధర్మవరం గేట్‌ను రైల్వే డీఆర్ఎం అనుమతితో వెడల్పు చేయించినట్లు వివరించారు. లెవల్ క్రాసింగ్ రైల్వే గేట్‌ను అండర్ బ్రిడ్జిని నిర్మించాలని రైల్వేశాఖకు వినతి పత్రాలు అందించామన్నారు. బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా రైల్వే స్థలంలో ఉన్న షాపులు మాత్రమే తొలగి స్తామని చెప్పారని, ఇప్పుడు పరిధిలో లేని ఇతర షాపులకు మార్కింగ్ ఇవ్వడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వైసీపీ నాయకులు తమ వల్లే బ్రిడ్జి అనుమతులు వచ్చాయంటూ ప్రచారం చేసుకోవడం తగదన్నారు. ఈ విషయంపై బుధవారం మిత్రపక్షాలతో కలసి రైల్వే డీఆర్ఎంను కలుస్తామన్నారు. టీడీపీ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఆర్ శ్రీనాథ్‌గౌడ్ మాట్లాడుతూ గత టీడీపీ హయంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కౌన్సిలర్లు డీఆర్ఎంకు వినతి పత్రాలను ఇచ్చామని వాటిని పరిశీలించాలన్నారు. అసత్య ప్రచారాలు చేసుకుంటూ అనుమతులు వారి ఖాతాలో వేసుకోవడం తగదని హితవు పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్ పవన్‌కుమార్‌గౌడ్, అనిల్‌గౌడ్, కురవ శీనన్న, రంజాన్, వాల్మీకి రాము, కేసీ రామాంజినేయులు, సురేష్, అతిక్, పల్లేశ్రీనివాసులు, బొట్టుకుల్లాయప్ప, సీపీఐ నాయకులు గోవిందు, వీరభద్రస్వామి, ఎస్ఎండీ గౌస్, రాము పాల్గొన్నారు.

ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించండి

గుంతకల్లు: ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది ఓటరు జాబితాను బూత్ ఏజెంట్లు, యూనిట్ ఏజెంట్లు, క్లస్టర్ ఏజెంట్లు నిశితంగా పరిశీలించాలని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు పేర్కొన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం ఆయన బూత్, యూనిట్, క్లస్టర్ ఏజెంట్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తుది జాబితాలో ఇంకా డబుల్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు, అనవసర తొలగింపులు, చేరని కొత్త ఓట్ల వివరాలను తేల్చాలని తెలిపారు. వార్డుల్లో ఇళ్లకు వెళ్లి కచ్చితమైన రిపోర్టును సేకరించాలన్నారు. కార్యక్రమంలో పవన్ కుమార్ గౌడు, ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్, ప్రతాప్‌నాయుడు, మస్తానప్ప, టీ కేశప్ప, పాల మల్లికార్జున, కృపాకర్, శివన్న, రాయల్ వెంకటేశులు, పజులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల కోసం ధర్నా



హామీ పత్రాలతో నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

ఉరవకొండ, జనవరి29: హామీ పత్రాలు ఇచ్చిన వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరుతూ లబ్ధిదారులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. లబ్ధిదారులు కార్యాలయం ఎదుట బైఠాయించి హామీ పత్రాలతో నిరసన తెలిపారు. తహసీల్దార్ కార్యాలయానికి తలుపులు వేసి ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు అధికార పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుడు నిరంజన్‌గౌడ్, మాజీ వార్డు సభ్యుడు వెంకటేశులు మాట్లాడుతూ గతంలో 3,200మందికి పట్టాలు మంజూరు చేశారని, రెండేళ్ల క్రితం వైసీపీ నాయకులు ఒకటో నెంబర్ పట్టాలు పంపిణీ చేశారన్నారు. కోర్టు కేసుల కారణంగా కొందరికి పట్టాలు ఆగిపోయాయని, 556మందికి హామీ పత్రాలు ఇచ్చారన్నారు. ఇటీవల కొన్ని కోర్టు సమస్యలు పరిష్కారం కావడంతో 527 మందికి పట్టాలు ఇచ్చారన్నారు. వీరిలో సీరియల్ నెంబర్ తీసుకోకుండా ఇష్టానుసారంగా పట్టాలు ఇచ్చారన్నారు. దీంతో నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందన్నారు. అర్హులైన వారందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు మాట్లాడుతూ రెండ్రోజులలోపు బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

గ్యాస్ ఏజెన్సీల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు: ఉమా



భీమరాజును పరామర్శిస్తున్న ఉమా మహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గం, జనవరి 29: గ్యాస్ ఏజెన్సీల నిర్లక్ష్యంతోనే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు అన్నారు. కుందుర్పి మండలం తెనగల్లులో సోమవారం ఉదయం ఓ ఇంటిలో గ్యాస్ సిలిండర్ పేలి గాయపడ్డ బాధితులను కళ్యాణదుర్గం ఆస్పత్రిలో ఆయన పరామర్శించారు. సంఘటన వివరాలను బాధితులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇదంతా సంబంధిత ఏజెన్సీలు, ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యపు ధోరణితోనే జరుగుతున్నాయన్నారు. వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గాయపడ్డ వారికి రూ. 20 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.

ఎస్ఐల బాధ్యతల స్వీకరణ

బొమ్మనహాళ్, జనవరి 29: మండల ఎస్ఐగా వీ శ్రీనివాసులు సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆయన కర్నూలు జిల్లా హొళగుంద మండలం నుంచి బొమ్మనహాళ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు.

పెద్దవడుగూరు: మండల నూతన ఎస్ఐగా శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న శ్రీనివాసులు ప్రమోషన్‌పై వెళ్లడంతో తిరుపతిలో పనిచేస్తున్న శ్రీనివాసులు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

గుత్తి, జనవరి 29: పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం, బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలంటూ సోమవారం తహసీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులను కల్పించాలన్నారు. వంద రోజులు పూర్తి అయిన వారికి 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రామకృష్ణ, నాయకులు నిర్మల, మల్లికార్జున, కవిత, మురళి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించి ఆదుకోండి

పెద్దవడుగూరు, జనవరి29: గత ఖరీఫ్, రబీ సీజన్‌లో సాగుచేసి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి దస్తగిరి మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన నిబంధనలతో రైతులకు న్యాయం జరగడం లేదని వీటిని సవరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా 5లక్షల ఎకరాల్లో పంటనష్టం జరగడంతో సుమారు రూ.6వేల కోట్లు పెట్టుబడి రూపంలో రైతులు నష్టపోయారన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు. నిరసనలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కృష్ణ, నారాయణ, రంగస్వామి, రఫీ పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



వెంకట రమణయ్య

గుంతకల్లుటౌన్, జనవరి 29: గుంతకల్లు మున్సిపల్ కమిషనర్‌గా పీ వెంకటరమణయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మల్లికార్జున ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. ప్రొద్దుటూరులో డీఆర్‌డీఎల్‌గా పనిచేస్తున్న వెంకటరమణయ్యను గుంతకల్లు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కరువు కోరల నుంచి కాపాడాలి: సీపీఐ



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి, జనవరి18: జిల్లాను కరువు కోరల నుంచి కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ కరువు బారినపడ్డ రైతులను తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖరీఫ్, రబీ పంటలు వర్షాభావ పరిస్థితుల వల్ల పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. పంటలు పండక చిన్నాచితక రైతులు ఉపాధి కూలీలుగా మారారన్నారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. కేంద్రబృందం సూచనల మేరకు స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట నష్టాన్ని జమచేయాలని డిమాండ్‌చేశారు. అంతకుమునుపు ఎద్దులబండిపై కూర్చొని సీపీఐ నాయకులు ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి ధర్నాలో పాల్గొన్నారు.

టీడీపీతోనే నాయీబ్రాహ్మణుల అభివృద్ధి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కూడేరు, జనవరి29: తెలుగుదేశం పార్టీతోనే నాయీబ్రాహ్మణులకు అనేక సంక్షేమ పథకాలు అందాయని నాయీబ్రాహ్మణ సాధికార సమితి నియోజకవర్గ అధ్యక్షుడు కడదరకుంట నాగరాజు పేర్కొన్నారు. సోమవారం కూడేరులో టీడీపీ పాలనలో అమలైన సంక్షేమ పథకాలపై పోస్టర్‌ను విడుదల చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. ఇప్పేరు రమణ, ప్రసాద్, నాగేంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

నియమాలు పాటిస్తేనే సురక్షిత ప్రయాణం

యాడికి, జనవరి29: రహదారి భద్రతా నియమాల పాటింపుతోనే వాహనదారులకు సురక్షిత ప్రయాణం సాధ్యమవుతుందని తాడిపత్రి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ తెలిపారు. సోమవారం మండలంలోని సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికులకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై భద్రతా నియమాల గురించి వివరించారు. కార్యక్రమంలో సాగర్ సిమెంట్స్ యూనిట్ హెడ్ రంగారెడ్డి, ఏజీఎం నాగేశ్వరరావు, హెచ్ఆర్ శ్రీమన్నారాయణ, డీఎం వలి పాల్గొన్నారు.

మరమ్మతు పనులకు భూమిపూజ

తాడిపత్రి, జనవరి29: పట్టణంలోని టైలర్స్‌కాలనీలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు మరమ్మతు పనులకు సోమవారం టీడీపీ కౌన్సిలర్లు భూమిపూజ చేశారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలమేరకు భూమిపూజ చేశామని కౌన్సిలర్లు తెలిపారు. భూమిపూజ చేసిన వారిలో కౌన్సిలర్లు విజయ్‌కుమార్, రేష్మాపర్వీన్, జింకా లక్ష్మీదేవి, హుస్సేన్‌బాషా తదితరులు ఉన్నారు.

మీతోనే మా యుద్ధం

- ఎంపీపీతో వైస్ ఎంపీపీ, వైసీపీ ఎంపీటీసీ వాగ్వాదం



సీడీపీఓను నిలదీస్తున్న సర్పంచులు

పామిడి, జనవరి 29: 'ప్రజలు ఏ సమస్యతో ఇబ్బందులు పడుతున్నా.. మేము ఎవరిని(ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డిని) అడగం. మీతోనే యుద్ధం చేస్తాం' అని ఎంపీపీ మురళీమోహన్ రెడ్డిపై వైస్ ఎంపీపీ కాయల మహేష్, వైసీపీ ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్ ఫైర్ అయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ ప్రభాకర్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం హాట్ హాట్‌గా జరిగింది. మండలానికి ఏయే నిధులు ఎప్పుడు వస్తున్నాయో.. ఎవరెవరికి ఎంతెంత.. దేనికి కేటాయిస్తున్నారో కూడా తెలియకుండా పోతోందని వైస్ ఎంపీపీ అసహనం వ్యక్తంచేశారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని తయారు చేసిన ఇన్‌పుట్ సబ్సిడీ నగదు రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని రామరాజుపల్లి సర్పంచు ముత్యాలురెడ్డి ఏఓ లీనావసుంధరను అడిగారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఆమె సమాధానమిచ్చారు. వేసవికాలం సమీపిస్తోందని పామిడి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ తాగునీటి ఎద్దడి తలెత్తుతోందని వైస్ ఎంపీపీ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాలకృష్ణను నిలదీశారు. నూతన బోర్లు వేసి తాగునీటి ఎద్దడికి తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లు, హెల్పర్లు 42రోజులు సమ్మె చేపట్టినా గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిత్యవసర సరుకులు పంపిణీ చేశామని గుత్తి సీడీపీఓ ఢిల్లీశ్వరి తెలియజేశారు. దీంతో సర్పంచులు ముత్యాలురెడ్డి, మూలి నాగేశ్వరరెడ్డి ఆమె వాదనతో వారించారు. ఎవరికి నిత్యవసర సరుకులు పంపిణీ చేయలేదని, చాలా కేంద్రాలలో కోడిగుడ్లు పాడైపోయాయని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు సర్పంచులు, ఎంపీటీసీలకు కనీస సమాచారం ఇవ్వడం కాని, కనీస గౌరవం కూడా ఇవ్వడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు ఎంఈఓ జయానాయక్ దృష్టికి తీసుకువచ్చారు. ఇలా సమస్యలపై సమావేశానికి హాజరైన అరకొర మంది ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. చాలా మంది ప్రజాప్రతినిధులు గైర్హాజరవడం, వచ్చిన ప్రజాప్రతినిధులు సమావేశంలో లేకుండా బయటికి వెళ్లడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

హద్దులు చూపించాలని నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

పెద్దవడుగూరు, జనవరి29: జగనన్న కాలనీలో తమకు కేటాయించిన స్థలాలకు హద్దులు చూపాలంటూ తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులు సోమవారం నిరసన తెలిపారు. మండలంలోని కొండూరు గ్రామంలో ప్రభుత్వం ఇచ్చిన జగనన్న కాలనీల్లో ఇళ్లస్థలాలకు హద్దులు చూపేవరకు కదలమని తహసీల్దార్ చాంబర్‌ను ముట్టడించి బైఠాయించారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇవ్వడంతో సమస్య సద్దుమణిగింది.

పుట్లూరు విద్యార్థుల ప్రతిభ

పుట్లూరు, జనవరి 29: శింగనమల నియోజకవర్గ పరిధిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పుట్లూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. నియోజకవర్గ స్థాయిలో ఖోఖో పోటీల్లో ద్వితీయ, కబడ్డీ పోటీల్లో మూడవ స్థానంలో నిలిచినట్లు పీఈటీ పవన్ సోమవారం తెలిపారు.

జీడిపల్లిలో 0.455 టీఎంసీల నిల్వ

బెళుగుప్ప, జనవరి 29: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుతం 0.455 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం వెల్లడించారు. ఔట్‌ఫ్లో 400 క్యూసెక్కులుండగా ఇన్‌ఫ్లో 435 క్యూసెక్కులు ఉందన్నారు.

మాకొడికిలో బాబు ష్యూరిటీ

కళ్యాణదుర్గం, జనవరి 29: శెట్టూరు మండల పరిధిలోని మాకొడికి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయచౌదరి ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌జీ శివశంకర్, గురుప్రసాద్, తిప్పారెడ్డి, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణాన్ని అలవర్చుకోవాలి

ఉరవకొండ, జనవరి 29: విద్యార్థులు సేవాగుణాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్‌లు బసవరాజు, హనుమప్ప పిలుపునిచ్చారు. మండలంలోని లత్తవరం తండాలో మహాత్మా డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంపత్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సత్యనారాయణ పాల్గొన్నారు.

రీషెడ్యూల్ చేసి రుణాలు అందించండి

తాడిపత్రిటౌన్, జనవరి29: రీషెడ్యూల్ చేసి రైతులకు రుణాలు అందించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం నాయకులు యూనియన్ బ్యాంక్ మేనేజర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. నాయకులు రాజారామిరెడ్డి మాట్లాడుతూ రబీ, ఖరీఫ్ సీజన్‌లో పంటలు పండకపోవడంతో కరువు ఏర్పడిందన్నారు. ప్రభుత్వం కూడా కరువు మండలంగా ప్రకటించిందన్నారు. కావున రైతులకు రీషెడ్యూల్ ద్వారా రుణాలు అందించాలని కోరారు. జయశేఖర్‌రెడ్డి, నారాయణరెడ్డి, శిరీష, శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విద్య ప్రాధాన్యం పట్ల అవగాహన

రాయదుర్గంరూరల్, జనవరి 29: గ్రామాల్లో విద్య ప్రాధాన్యం గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగప్ప పేర్కొన్నారు. సోమవారం బీఎన్ హళ్లి గ్రామంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అక్షరాస్యతపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు స్థానిక పాఠశాలలోని విద్యార్థులకు అక్షరాస్యత ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ నాగరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డీ నారాయణ, ఎం రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

బ్రహ్మసముద్రం, జనవరి 29: మండలంలోని మామడూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గొల్ల అజ్జప్ప ఆదివారం మృతి చెందాడు. ఈసమాచారం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు పార్టీ నాయకులను గ్రామానికి పంపారు. పార్టీ మండల కన్వీనర్ పలబండ్ల శ్రీరాములు అజ్జప్ప నివాసానికి చేరుకుని మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి చంద్రన్న స్ఫూర్తితో ఉమన్న ఆర్థిక సాయం కింద రూ. ఐదు వేలు కుటుంబానికి అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి టీడీపీ పార్టీ ఎల్లవేళలా కుటుంబానికి అండగా వుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ అంకె ఓబుళేసు, బూత్ లెవెల్ ఏజెంట్ రామచంద్ర, బడప్ప, ఈరన్న, చన్నమల్ల, ముక్కన్న, చిక్కీర ప్రసాద్, లక్ష్మణ్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.